## శ్రీ లక్ష్మీనృసింహస్వామిని దర్శించుకున్న హైకోర్టు జడ్జి


లక్ష్మీనృసింహస్వామిని దర్శించుకుంటున్న హైకోర్టు జడ్జి

**వర్గల్, సెప్టెంబర్ 5 (ప్రభాతవార్త):** మండల పరిధిలోని నాచగిరి శ్రీలక్ష్మీనృసింహ స్వామిని శుక్రవారం హైకోర్టు జడ్జి గాడిపల్లి ప్రవీణ్‌కుమార్ కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఈ సందర్భంగా అర్చకులు, అధికారులు మేళతాళాలు, పూర్ణకుంభంతో ఘన స్వాగతంపలికారు. శ్రీలక్ష్మీనృసింహస్వామిని దర్శించుకొని పూజలు చేసిన అనంతరం గాడిపల్లి ప్రవీణ్‌కుమార్‌కు అర్చకులు తీర్థ ప్రసాదాలను అందజేసి స్వామివారి శేష వస్త్రంతో ఘనంగా సన్మానించారు.

మెదక్ | సంగారెడ్డి | సిద్దిపేట



వార్త

## కాంగ్రెస్ లీగల్ సెల్ హైదరాబాద్ కన్వీనర్‌గా దినేష్

**హుస్నాబాద్ రూరల్ / కోహెడ, సెప్టెంబర్ 5, ప్రభాతవార్త:** కాంగ్రెస్ పార్టీ లీగల్ సెల్ విభాగం హైదరాబాద్ కన్వీనర్‌గా కోహెడ మండలం శ్రీరాములపల్లి గ్రామానికి చెందిన హైకోర్టు న్యాయవాది మఠారి దినేష్ గురువారం నియమితులయ్యారు. హైదరాబాద్ లీగల్ సెల్ కన్వీనర్‌గా ఎన్నికైన దినేష్‌కు శుక్రవారం రోజున హైదరాబాద్‌లోని పొన్నం లా ఛాంబర్స్‌లో జరిగిన సమావేశంలో టిపిసిసి లీగల్ సెల్ చైర్మన్ పొన్నం అశోక్‌గౌడ్ నియామక పత్రాన్ని అందజేశారు. దినేష్ హైకోర్టు న్యాయవాదిగా రెండేళ్లుగా కొనసాగుతున్నారని తెలిపారు. అనంతరం దినేష్ మాట్లాడుతూ తన నియామకానికి సహకరించిన ఏఐసిసి మెంబర్లు, టిపిసిసి వైస్ ప్రెసిడెంట్ కోట నీలిమకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.


దినేష్‌కు నియామక పత్రం అందిస్తున్న అశోక్‌గౌడ్


రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న మంత్రి, ఎంపి, ఎమ్మెల్యే

## రాష్ట్రాభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

### వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహా

**మనూర్, సెప్టెంబరు 5,ప్రభాతవార్త:** రాష్ట్రాభివృద్దే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వ పాలన చేస్తోందని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సి.దామోదర్ రాజనర్సింహ అన్నారు. శుక్రవారం రూ. 5 కోట్లతో మండల పరిధిలోని డవ్వూర్ చౌరస్తా నుంచి ఎన్‌జి హుక్రాన మీదుగా ఎల్గోయి అతిమ్యాల రోడ్డు నిర్మాణానికి మంత్రి దామోదర్ రాజనర్సింహ జహీరాబాద్ ఎంపి సురేష్‌కుమార్ శెట్కార్, నారాయణఖేడ్ ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవ రెడ్డితో కలిసి శంకుస్తాపన చేశారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ చంద్ర శేఖర్, సబ్ కలెక్టర్ ఉమహారతి, ఆర్ అండ్ బి ఈఈ నర్సింలు, ఏఈ రవీందర్, శ్రీనివాస్, కరుణాకర్, జూనియర్ అసిస్టెంట్ ఖాజా మైనుద్దీన్, మాజీ సర్పంచ్ కె దిగంబర్‌రెడ్డి, బ్రహ్మానందరెడ్డి, న్యాయవాది సంగన్న, ఈశ్వరప్ప, విఠల్‌రావు, రాజు, శివకుమార్, అశోక్‌రావు. విష్ణువర్ధన్‌రెడ్డి, అశోక్‌రెడ్డి, రాజుయాదవ్, శివాజీరావు, రహీం, పండరి పాల్గొన్నారు.

**పిహెచ్‌సి భవనాన్ని ప్రారంభించిన మంత్రి...**


పిహెచ్‌సి భవనాన్ని ప్రారంభిస్తున్న మంత్రి దామోదర్ రాజనర్సింహా

**సిర్గాపూర్, సెప్టెంబరు 5, ప్రభాతవార్త:** మండల కేంద్రంలో 156 లక్షల రూపాయలతో నిర్మించిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రం భవనాన్ని శుక్రవారం వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సి దామోదర్ రాజనర్సింహ ఎంపి సురేష్‌కుమార్ శెట్కార్, ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డిలతో కలసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి దామోదర్ రాజనర్సింహ మాట్లాడుతూ గత పదేళ్లలో బిఆర్‌ఎస్ ప్రభుత్వం వైద్య వ్యవస్థను భ్రష్టు పట్టించిందని దుయ్యబట్టారు. కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రాభివృద్ధికి, ప్రజల సంక్షేమానికి ప్రణాళిక ప్రకారం అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తూ వస్తోందన్నారు. సిర్గాపూర్ మండలం కర్నాటక, మహారాష్ట్రాలకు సరిహద్దులో ఉండటంతో చికిత్స నిమిత్తం ఆయా రాష్ట్రాల నుంచి ప్రజలు వస్తూ ఉంటారన్నారు. ఆసుపత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్య అందించాలని డాక్టర్లు, సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో జిల్లా వైద్యాధికారులు, మండల అధికారులు, ప్రజాప్రతినిధులు,మండల కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## రాష్ట్రస్థాయిలో ఉత్తమ అవార్డు అందుకున్న జిల్లా కలెక్టర్ హైమావతి, డిఈవో శ్రీనివాస్‌రెడ్డి

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి:**


సిఎం రేవంత్‌రెడ్డి నుంచి అవార్డు అందుకుంటున్న జిల్లా కలెక్టర్

జిల్లాను విద్యారంగంలో అన్ని విభాగాల్లో ఉత్తమ ప్రదర్శన కనబరిచినందుకు సిద్దిపేట జిల్లా కలెక్టర్ కె.హైమావతి, డిఈవో శ్రీనివాస్‌రెడ్డిలు రాష్ట్రస్థాయిలో మొదటి అవార్డును అందుకున్నారు. ఈ మేరకు శుక్రవారం హైదారాబాద్‌లోని శిల్పకళా వేదికలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సిఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా జిల్లా కలెక్టర్ కె.హైమావతి, డిఈఓ శ్రీనివాస్‌రెడ్డిలు రాష్ట్ర స్థాయి మొదటి అవార్డును అందుకున్నారు. కార్యక్రమంలో రెవెన్యూ, గృహనిర్మాణశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయుడిగా సాయిసిరి

**పాపన్నపేట, సెప్టెంబర్ 5, ప్రభాతవార్త :** మండలపరిధిలోని గాజుల గూడెం ప్రాథమికోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు సాయిసిరి రాష్ట్ర స్థాయి ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపికయ్యారు. ఈమేరకు ఈనెల ఐదో తేదీన ఉపాధ్యాయ దినోత్సవం పురస్కరించుకొని ఆయనకు హైదరాబాద్ లోని హరిహర కళాభవన్‌లో ముఖ్యమంత్రి చేతుల మీదుగా సన్మానించనున్నారు. అయితే సాయిసిరి 27 సంవత్సరాలుగా ఉపాధ్యాయులుగా కొనసాగుతుండగా 25 సంవత్సరాలు పాపన్నపేట మండలంలోని ఉపాధ్యాయులుగా పనిచేస్తున్నారు. ఆయన వృత్తిలో చేరి విశేష సేవలందించినందుకు ఉపాధ్యాయుడిగా ఎంపికయ్యారు. సాయిసిరి రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపిక కావడంపట్ల ఎంఈఓ ప్రతాపరెడ్డి, వివిధ ఉపాధ్యాయ సంఘాలు హర్షం వ్యక్తం చేశాయి.

## కంప్యూటర్ స్కిల్స్ సర్టిఫికేట్ కోర్స్‌కు దరఖాస్తుల ఆహ్వానం

**హుస్నాబాద్ రూరల్, సెప్టెంబరు 5, ప్రభాతవార్త :** పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నూతనంగా కంప్యూటర్ బేసిక్స్ పైన సర్టిఫికెట్ కోర్సు ప్రారంభిస్తున్నట్లు ప్రిన్సిపాల్ విజయగిరి బిక్షపతి తెలిపారు. శుక్రవారం కళాశాలలో కోర్సు నిర్వహించేందుకు వచ్చిన ప్రభుత్వ ఉత్తర్వు లను అధ్యాపక బృధంతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇంటర్, డిగ్రీ పూర్తి చేసిన విద్యార్థులతో పాటు ప్రస్తుతం డిగ్రీ చదువుతున్న విద్యార్థులు, ఆసక్తి గల వారు ఈ కోర్సుకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అత్యాధునిక కంప్యూటర్ ల్యాబ్‌లో దరఖాస్తు చేసుకున్న వారికి శిక్షణ ఇవ్వనున్నట్లు వివరించారు. ఈ కోర్సుకు రెండు నెలల శిక్షణ ఉంటుందని, ఆసక్తి గల వారు ఈనెల 10వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని పూర్తి వివరాలకు 8897402310కు సంప్రదించాలన్నారు.

# ఖేడ్‌ను అభివృద్ధి చేసిన ఘనత కాంగ్రెస్‌దే

### మంత్రి దామోదర రాజనర్సింహా


పనులకు శంఖుస్థాపన చేస్తున్న మంత్రి దామోదర రాజనర్సింహా

**నారాయణఖేడ్, సెప్టెంబర్ 5 ప్రభాతవార్త :** ఖేడ్‌ను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసిన ఘనం కాంగ్రెస్ పార్టీదేనని మంత్రి దామోదర రాజనర్సింహా అన్నారు. జహీరాబాద్ ఎంపి సురేష్‌కుమార్ శెట్కార్, నారాయణఖేడ్ ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవరెడ్డితోకలిసి నారాయణఖేడ్‌లోని సమావేశమందిరం భోజనశాల, వంట గది నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అలాగే కరస్ గుత్తి పీడబ్ల్యూడి రోడ్డు నుండి ఎన్‌జీ హుక్రన వయా ఎల్గోయి అతిమ్యాల్ రోడ్డు, బాణపూర్ నుండి జి హుక్రన కలిపే లింకు రోడ్డులను ఫార్మేషన్ గ్రావెల్డింగ్‌తో నిర్మించిన రోడ్డు, అర్బన్ ఫారెస్ట్ పార్కులో అభివృద్ధి పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి దామోదర రాజ నర్సింహా మాట్లాడుతూ, ఆందోల్ నియోజక వర్గం పుల్కల్ మండలంలో అటవీశాఖకు 3000 ఎకరాల భూమి ఉందని, దానిని అర్బన్ ఫారెస్ట్ డెవలెప్‌మెంట్‌గా అభివృద్ధి చేస్తాం అని, ఈ ఆలోచన రావడానికి కారణం మీఎమ్మెల్యే సంజీవరెడ్డి అని మంత్రి తెలిపారు. ప్రజలు, వృద్ధులు కుటుం బాలతో కలిసి కొద్దిసేపు పార్కులో గడిపి వెళ్తారు. ఈ పార్కుకు క్లాక్ టవర్, మినీ వాటర్ ఫాల్స్ వంటి ఏర్పాటు చేస్తున్నందుకు ఫారెస్ట్ అధికారులను మంత్రి అభినందించారు. రేవంత్ ప్రభుత్వం రాష్ట్రాన్నీ అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తుందని చెప్పారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వం అవినీతికి అడ్రస్‌గా మారిందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ చంద్రశేఖర్, సబ్ కలెక్టర్ ఉమహారతి, కాంగ్రెస్ నాయకులు పట్లోళ్ల సుధాకర్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ జగ్జీవన్, మాజీ మునిసిపల్ చైర్మన్ ఆనంద్‌స్వరూప్ షెట్కార్, వైస్ చైర్మన్ దారం శంకర్, ఎస్సీ సెల్ అధ్యక్షుడు గైని సాయిలు, తహెర్, జిల్లా ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# ఉపాధ్యాయులు విద్యార్థులకు ఆదర్శంగా ఉండాలి



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ ప్రావీణ్య

**సంగారెడ్డి మున్సిపాలిటీ సెప్టెంబర్ 5,ప్రభాతవార్త:** ఉపాధ్యాయులు విద్యార్థులకు ఆదర్శంగా ఉండాలని సంగారెడ్డి జిల్లా కలెక్టర్ పి.ప్రావిణ్య అన్నారు. శుక్రవారం సంగారెడ్డి కలెక్టరేట్ ఆడిటోరియంలో జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో జరిగిన ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారం ప్రదాన కార్యక్రమానికి టీజీఐఐసీ చైర్మన్ నిర్మలాజగ్గారెడ్డితో కలిసి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఉపాధ్యాయులు విద్యార్థులకు ఆదర్శంగా ఉండాలని అన్నారు. విద్యార్థులకు సంపూర్ణ బోధనను అందించి ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాలని కలెక్టర్ ఉపాధ్యాయులకు సూచించారు. ప్రస్తుత పరిస్థితులలో బోధన సవాలుతో కూడుకున్నదని, ఉపాధ్యాయులు నిరంతర విద్యార్థిగా కొత్త కొత్త విషయాలను నేర్చుకున్నప్పుడే విద్యార్థులకు సులభంగా అన్ని అంశాలను బోధించగలుగుతాడన్నారు. పాఠశాలలో మౌలిక వసతుల మెరుగు కోసం ప్రభుత్వం కృషి చేస్తున్నదని చెప్పారు. బోధనకు అవసరమైన అన్ని రకాల మౌలిక వసతులను ప్రభుత్వం కల్పిస్తుందని ప్రభుత్వం కల్పిస్తున్న వసతులను సద్వినియోగం చేసుకొని విద్యార్థులకు సంపూర్ణ విద్యను అందించాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు పొందిన ఉపాధ్యాయులకు కలెక్టర్ శుభాకాంక్షలు తెలిపారు. విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర మరువ లేనిదని టీజీఐఐసీ చైర్మన్ నిర్మల జగ్గారెడ్డి అన్నారు. మన సమాజంలో ఉపాధ్యాయునికి తల్లిదండ్రుల తర్వాత స్థానం ఇవ్వబడిందని చెప్పారు. రాష్ట్రంలోని ప్రజా ప్రభుత్వం పాఠశాలల్లో మౌలిక వసతుల మెరుగు కోసం కృషి చేస్తున్నది అన్నారు. ప్రైవేటు పాఠశాలలతో పోలిస్తే ప్రభుత్వ పాఠశాలలో నైపుణ్యం గల ఉపాధ్యాయులు ఉన్నారన్నారు. అనంతరం జిల్లాలో ఉత్తమ ఉపాధ్యాయులుగా గుర్తించిన ఉపాధ్యాయులకు పురస్కారాలు అందజేసి సత్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాధికారి వెంకటేశ్వర్లు, జిల్లాలోని వివిధ ఉపాధ్యాయుల సంఘాల నాయకులు, ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీతలు పాల్గొన్నారు.


అమ్మవారికి బంగారు నెక్లెస్ అందజేస్తున్న దృశ్యం

## ఏడుపాయల్లో వాహన షెడ్డు ప్రారంభం

**పాపన్నపేట, సెప్టెంబర్ 5, ప్రభాతవార్త :** ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన ఏడుపాయల్లో వాహన పూజ కోసం ఓ భక్తుడు ఏర్పాటు చేసిన షెడ్డును శుక్రవారం ప్రారంభించారు. గొల్లపల్లికి చెందిన లోకేశ్వర్ శ్రీనివాస్ రెడ్డి తన మాతృమూర్తి జొన్న యశోద జ్ఞాపకార్థం ఏడుపాయల్లో వాహన పూజ కోసం షెడ్డును ఏర్పాటు చేయడంతో పాటు దుర్గమ్మ తల్లికి 57 గ్రాముల బంగారు నెక్లెస్ ను చేయించారు. రూ.2.60 లక్షల వ్యయంతో నిర్మించిన షెడ్డుకు పూజ చేయించి,ప్రారంభోత్సవం చేసి, ఆలయ సిబ్బందికి నెక్లెస్ అందజేశారు.

## తండ్రిని అబాసుపాలు చేస్తున్న కవిత

**చిన్నకోడూరు, సెప్టెంబర్ 5, ప్రభాతవార్త :** తండ్రిపై ప్రేమను చూపుతునే కెసిఆర్‌ను ప్రజల్లో అబాసుపాలు చేస్తున్న విషయాన్ని కవిత మర్చిపోయారని బిఆర్ఎస్ నేత జంగిటి శ్రీనివాస్‌ముదిరాజ్, ఎఫ్‌పివో మండల చైర్మన్ ఏలేటీ వెంకట్‌రెడ్డి అన్నారు. చిన్నకోడూరులో శుక్రవారం వారు మాట్లాడుతూ, బిఆర్ఎస్ పార్టీని నాశనం చేయడానికే కవిత పూనుకున్నదని, బిఆర్ఎస్ పురుడుపోసుకున్న సమయంలో కవిత ఎక్కడ ఉందని ప్రశ్నించారు. బిఆర్ఎస్ పార్టీ స్థాపించిన నాటి నుంచి ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు వరకు హరీష్‌రావు కెసిఆర్ అడుగుజాడల్లో నడుచుకుంటు వస్తున్నారని తెలిపారు. అనాటి నుంచి నేటీ వరకు హరీష్‌రావు బిఆర్ఎస్ బలోపేతమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నారని తెలిపారు. హరీష్‌రావుపై చేసిన అనుచిత వ్యాఖ్యాలను కవిత వెంటనే వెనక్కి తీసుకొని భేషరతుగా క్షమాపణ చెప్పాలన్నారు. సమావేశంలో పార్టీ నాయకులు నరసింహ్మారెడ్డి, జాలపల్లి దుర్గారెడ్డి, కోనేటి మహేష్‌లు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న బిఆర్ఎస్ నాయకులు

# ఉత్తమ విద్యా ప్రమాణాలకు 'కెజిబివి'లు ఆదర్శం

### మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్


సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న కలెక్టర్, తదితరులు

**రామాయంపేట మున్సిపాలిటీ, సెప్టెంబర్ 5, ప్రభాతవార్త :** జిల్లాలోని కెజీబీవీలు విద్యా ప్రమాణాల్లో ఆదర్శంగా నిలుస్తున్నాయని మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్ అన్నారు. ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆయన శుక్రవారం రామాయంపేట కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం తరగతి గదులు, వంటశాల, హాజరు పట్టిక, మధ్యాహ్న భోజన నాణ్యత, వసతి గదులు, ఫర్నిచర్, పారిశుద్ధ్య పరిస్థితులను సమీక్షించారు. విద్యార్థినులకు మెనూ ప్రకారం సకాలంలో పోషక విలువలతో కూడిన ఆహారం అందించాలనీ, శుద్ధమైన తాగునీరు తప్పనిసరిగా అందించాలని ఆయన సూచించారు. తరగతులను సందర్శించిన కలెక్టర్, విద్యార్థులతో ముచ్చటించి వారి అభ్యాసం, బోధన పద్ధతులపై వివరాలు తెలుసుకున్నారు.

ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించు కుని కలెక్టర్ మాట్లాడుతూ, పిల్లలను భావి భారత పౌరులుగా తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయులు ఎంతో గొప్ప బాధ్యత నిర్వర్తిస్తున్నారు. జిల్లాలోని కేజీబీవీలు విద్యా ప్రమాణాల్లో ఆదర్శంగా నిలుస్తున్నాయి" అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు మరియు సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

**గణేష్ నిమజ్జన ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్..**

రామాయంపేట మున్సిపాలిటీ పరిధి లోని సర్వాయికుంట వద్ద గణేష్ నిమజ్జన ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ శుక్రవారం సందర్శించి సమీక్షించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మున్సిపాలిటీ పరిధిలో గణేష్ నిమజ్జనం శాంతి యుతంగా, సాఫీగా జరిగేలా మున్సిపల్ అధికారులు, పోలీసు అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పకడ్బందీ చర్యలు తీసుకోవాలని సూచించారు. పట్టణ ప్రధాన రహదారుల గుండా నిమజ్జనానికి వెళ్లే వినాయక విగ్రహాల ర్యాలీలపై ప్రత్యేక శ్రద్ధ పెట్టి, రాకపోకలు అంతరాయం కలగకుండా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలని ఆయన అధికారులను ఆదేశించారు.స్థానిక మున్సిపల్ కమిషనర్ ఎం.దేవేందర్‌కు తగు సూచనలు ఇస్తూ, సర్వయికుంట చెరువులో జరిగే నిమజ్జన కార్యక్రమాల సందర్భంగా ప్రజాప్రతినిధులు కూడా చొరవ తీసుకొని భద్రతా చర్యలకు సహకరించాలని ఆయన కోరారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా అన్ని విభాగాలు సమన్వయంతో ముందస్తు ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ ప్రత్యేకంగా ఆదేశించారు. కలెక్టర్ పర్యటనలో మండల తహసీల్దార్ రజనీకుమారి, మున్సిపల్ కమిషనర్ ఎం.దేవేందర్, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ సైదయ్య, మున్సిపల్ వార్డు అధికారులు, ప్రజాప్రతినిధులు చౌదరి సుప్రభాత రావు, తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న బైరి శంకర్

## పేదల సంక్షేమమే ప్రధాని మోడీ లక్ష్యం

### బిజెపి జిల్లా అధ్యక్షుడు బైరి శంకర్

**గజ్వేల్, సెప్టెంబర్ 5 (ప్రభాతవార్త):** పేదల పక్షపాతి, బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి ప్రధాని నరేంద్రమోడి అని బిజెపి జిల్లా అధ్యక్షుడు బైరి శంకర్‌ముదిరాజ్, గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మాజీ మున్సిపల్ చైర్మన్ గాడిపల్లి భాస్కర్, పట్టణ అధ్యక్షుడు మనోహర్‌యాదవ్ పేర్కొన్నారు. శుక్రవారం గజ్వేల్ లోని అంబేద్కర్ చౌరస్తా వద్ద మోడీ చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. అనంతరం గాడిపల్లి భాస్కర్ నివాసంలో మాట్లాడుతూ పేదలకు భారం తగ్గించాలనే ఉద్దేశంతోనే ప్రధాని మోడి జిఎస్టీ తగ్గించారన్నారు. దసరా, బతుకమ్మ, దీపావళి పం డుగలకు కానుకగా జిఎస్టీ తగ్గించారన్నారు. మధ్య తరగతి వర్గానికి మోడి ఇచ్చిన ఒక గొప్ప బహు మానం అన్నారు. ప్రధాని నరేంద్రమోడి తీసుకున్న నిర్ణయం పేద, మధ్యతరగతి కుటుంబాలకు ఊరట కలిగించిందని చెప్పారు. గృహ వినియోగా వస్తువు లపై పన్నులను తగ్గించడం వల్ల నేరుగా వినియోగ దారులకు లాభం చేకూరుతుందన్నారు. పన్నులు తగ్గించడం పట్ల 40 వేల కోట్ల ఆదాయం తగ్గుతుం దని తెలిసినా ఇంత సాహసోపేత నిర్ణయం తీసుకోవడం అభినందనీయమన్నారు. వైద్యరంగం, ఇన్సూరెన్స్ రంగాలలో జిఎస్టీ తగ్గింపు అమలులోకి వచ్చిందని, ఆసుపత్రి సేవలు, వైద్య పరికరాలు, ఆరోగ్య బీమా పాలసీలపై పన్నులు తగ్గించారన్నారు. అధిక ప్రీమియం కారణంగా ఇన్సూరెన్స్‌కు దూరంగా ఉన్న మధ్యతరగతి కుటుంబాలకు తక్కువ ధరలో బీమా పొందే అవకాశం ఉంటుందన్నారు. నిత్యావసర సరుకులపై పన్ను తగ్గడంవల్ల ఖర్చులు తగ్గుతాయన్నారు. పండుగల సీజన్‌ను దృష్టిలో ఉంచుకొని తీసుకున్న ఈ నిర్ణయం ప్రజల్లో సంతోషాన్ని నింపిందన్నారు. ఈ నిర్ణయంతో మోడి దేశ రాజకీయ చరిత్రలో ప్రత్యేకంగా నిలిచిపోతారని తెలిపారు. ఈ కార్యక్రమంలో బిజెపి మండల అధ్య క్షుడు అశోక్‌గౌడ్, నాయకులు సింగం సత్తయ్య, ఎల్లు రాంరెడ్డి, ఎల్కంటి సురేష్, జిల్లా కమిటీ సభ్యుడు వెంకట్‌రెడ్డి, కాశమైన సందీప్, బారు అరవింద్, అయిల మహేందర్, రాజేశ్వర్ చారి, జిల్లా రమేష్, రాంచంద్రచారి, నాయిని సందీప్, రాజు తదితరులు పాల్గొన్నారు.

## ఎంఆర్‌పిఎస్ జిల్లా అధికార ప్రతినిధిగా ప్రవీణ్‌కుమార్


నియామక పత్రం అందజేస్తున్న నాయకులు

**సంగారెడ్డి మున్సిపాలిటీ సెప్టెంబర్ 5, ప్రభాతవార్త:** ఎమ్మార్పీఎస్ సంగారెడ్డి జిల్లా అధికార ప్రతినిధిగా హత్నూర గ్రామానికి చెందిన నల్లోల్ల ప్రవీణ్‌కుమార్‌మాదిగను నియమిస్తూ శుక్రవారం సంగారెడ్డిలోని అంబేద్కర్ భవన్‌లో జరిగిన సమావేశంలో ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పి జిల్లా ఇన్‌చార్జి వి.ఎస్.రాజుమాదిగ, జిల్లాఅధ్యక్షుడు మైసగల్ల బుచ్చేంద్ర మాదిగ, నాయకురాలు పెద్ద గీతామాదిగ ఆధ్వర్యంలో నియామకపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన జిల్లా అధికార ప్రతినిధి గా నియమితులైన నల్లోల్ల ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ అధికార ప్రతినిధిగా ఎన్నుకున్నందుకు పద్మశ్రీ మంద కృష్ణమాదిగకు, జిల్లా నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

## గుండె పోటుతో కార్మిక నేత ఎల్లయ్య మృతి

**రామచంద్రాపురం, సెప్టెంబరు 5, ప్రభాతవార్త:** ట్రేడ్ యూనియన్ నేత, తెలంగాణవాది బిహెచ్‌ఈఎల్ ఎల్లయ్య శుక్రవారం ఉదయం గుండె పోటుతో మృతి చెందారు. 1969 తెలంగాణ ఉద్యమంలో క్రియాశీలకంగా పనిచేసిన ఎల్లయ్య మలి దశ ఉద్యమంలోనూ పాల్గొని పలుమార్లు జైలుకు వెళ్లారు. అమీన్‌పూర్ మున్సిపాలిటీ కిష్టారెడ్డిపేట పరిధిలోని ఇంటికి ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి, నాయకులు,ప్రజాప్రతినిధులు, కార్మిక సంఘం నాయకులు, చేరుకుని ఎల్లయ్య పార్థీవదేహానికి నివాళులర్పించి కుటుంబ సభ్యులకు సానుబూతి ప్రకటించారు.

### బిహెచ్‌ఈఎల్ నేత ఎల్లయ్య మృతి తెలంగాణకు తీరని లోటు

**బిజెపి స్టేట్ కౌన్సిల్ సభ్యులు రాగి రాములు..**

**రామాయంపేట, సెప్టెంబర్ 5, ప్రభాతవార్త :** సుధీర్ఘ ప్రస్థానం బిహెచ్‌ఈఎల్ నిర్మాణం చేసిన ఘనత గాజుల ఎల్లయ్యదని బిజెపి స్టేట్ కౌన్సిల్ సభ్యుడు రాగి రాములు అన్నారు. ఉద్యోగ బాధ్యతలో యూనియన్ ఐఎన్‌టీయూసీనీ ఏకధాటిగా నడిపించి భెల్ కార్మికుల కష్ట సుఖాలు పాలుపంచుకొని అందరి మన్నలు పొందిన వ్యక్తి అన్నారు. అప్పటి ప్రధాన మంత్రి శ్రీమతి ఇందిరాగాంధీ, మాజీప్రధాని పీవీ నరసింహారావు, నీలం సంజీవరెడ్డి, మల్లికార్జున్, మర్రి చెన్నారెడ్డి, కోట్ల విజయభాస్కర్‌రెడ్డితో నేరుగా పరిచయం ఉందని, వారందరూ పేరుపెట్టి గాజుల ఎల్లయ్య అని పిలిపించుకొనే నాయకుడు మృతి చాలా బాధాకరం అన్నారు. 1969,2001 ఉద్యమంలో తెలంగాణ కోసం పోరాడిన గొప్ప నాయకుడనీ, భెల్ ప్రసిడెంట్‌గా పనిచేయడం, అక్కడున్నవారికి చాలా న్యాయం చేయడం ఆయన నైజం అని, ఏదిఏమైనా ఆయన మరణం రాజకీయంగా గొప్ప నాయకుడు కోల్పోవడం బాధాకరం, అక్కన్నపేటలో పుట్టి ..పదవ తరగతి వరకు కూడా ఇక్కడే చదువుకుని ఉన్నత చదువుల కోసం మేడ్చల్ ఐటిఐ లో చేరి అప్పుడు ఏర్పాటైన మెదక్ జిల్లాలోని బిహెచ్ఇఎల్ కంపెనీలో ఒక కార్మికుడిగా జీవితం ప్రారంభించి ఒక కార్మిక నాయకుడిగా వెలుగొందారన్నారు. అక్కన్నపేట గ్రామం ఒక గొప్ప నాయకున్ని కోల్పోవడం బాధాకరమన్నారు.

## భార్య. పిల్లలు వేధిస్తున్నారు... న్యాయం చేయండి

### హుస్నాబాద్ పోలీస్ స్టేషన్‌లో బాదితుడి ఫిర్యాదు

**హుస్నాబాద్ రూరల్, సెప్టెంబరు 5, ప్రభాతవార్త :** అనారోగ్యంతో బాధపడుతున్న తనను భార్యతోపాటు పిల్లలు చిత్రహింసలకు గురి చేస్తున్నారని వారిపై చర్యలు తీసుకుని న్యాయంచేయాలని కోరుతూ హుస్నాబాద్ పోలీస్‌స్టేషన్‌లో బాధితుడు సన్నీల వెంకన్న శుక్రవారం ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరునెలలుగా అనారోగ్యంతో బాధపడుతున్న తనను భార్య, పిల్లలు కరీంనగర్ తీసుకెల్లి బస్టాండ్‌లో వదిలిపెట్టి వెళ్లిపోయారని వాపోయారు.కరీంనగర్ బస్టాండ్‌లో ఉన్న ప్రయాణికుల సహాయంతో హుస్నాబాద్‌కు చేరుకుని వారిపై ఫిర్యాదు చేసినట్లు వివరించారు. కుమారుడు, కుమార్తెను ఉన్న ఆస్తులు అమ్మి చదివించి వైద్యులను చేశానని, కుమారుడు రాజేష్ చిగురుమామిడి ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యునిగా విధులు నిర్వహిస్తున్నారని తెలిపారు.

# వీడ్కోలుకు వేళాయెరా


ట్యాంక్‌బండ్ వద్ద నిమజ్జన ఏర్పాట్లను పరిశీలిస్తున్న మంత్రి పొన్నం, కలెక్టర్, మేయర్, కమిషనర్


ఖైరతాబాద్ గణేశ్‌నకు హారతి సమర్పిస్తున్న సిఎం రేవంత్

## నిమజ్జనానికి సర్వం సిద్ధం..నేడు ఒంటి గంటలోపు బడా గణేష్ నిమజ్జనం

### ట్యాంక్‌బండ్ చుట్టూ 40 క్రేన్ల ఏర్పాట్లు

### అర్ధరాత్రి 1గంటల వరకు మెట్రోరైల్ వేళలు పొడిగింపు

### 64 ప్రాంతాల్లో ట్రాఫిక్ డైవర్షన్..బారీకేడ్లు ఏర్పాటు

**హైదరాబాద్, సెప్టెంబరు 5, ప్రభాతవార్త:** గణేష్ నిమజ్జనానికి సర్వం సిద్ధమైంది. భక్తులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా జిహెచ్ఎంసి, పోలీస్, ట్రాఫిక్ విభాగాలు అన్ని చర్యలు తీసుకుంటున్నారు. ఇప్పటికే జిహెచ్ఎంసి పరిధిలోని పలు చెరువుల్లో నిమజ్జనాలు కొనసాగుతుండగా..చివరిరోజు శనివారం హుస్సేన్‌సాగర్‌కి పెద్దఎత్తున తరలిరానున్నాయి. బాలాపూర్ వినాయకుడి నుంచి హుస్సేన్‌సాగర్ వరకు దాదాపు 21కిలోమీటర్లు శోభయాత్ర జరిగేలా ఏర్పాట్లు పూర్తిచేశారు. సామూహిక ఊరేగింపు, నిమజ్జనానికి 29 వేల మంది సిబ్బందితో పటిష్ట ఏర్పాట్లు చేశారు. నిమజ్జన ఘట్టం ఏమాత్రం ఆలస్యం కాకుండా గతం కంటే వీలైనంత త్వరగా పూర్తి చేసేలా ప్రణాళికలు సిద్ధం చేశారు. గతానుభవాలను దృష్టిలో పెట్టుకుని ఈ ఏడాది అదనపు చర్యలు తీసుకుంటున్నారు. నగరంలోని అనేక ప్రాంతాల్లో పికెట్లు ఏర్పాటు చేశారు. రౌడీషీటర్లతో పాటు అనుమానిత వ్యక్తుల బైండోవర్, వారిపై నిఘా ఉంటుంది. ప్రతి ఏడాది ఈ కార్యక్రమం మరుసటి రోజు మధ్యాహ్నం వరకు సాగుతోంది. దీంతో ఈ ఏడాది మండవ నిర్వాహకులు, ఉత్సవ కమిటీ సహకారంతో శనివారం అర్ధరాత్రి లేదా ఆదివారం తెల్లవారుజాము లోపు పూర్తయ్యేలా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. ఖైరతాబాద్ మహా గణేషుడి నిమజ్జనం ఊరేగింపు ఉదయం 6 గంటలకే ప్రారంభమై.. మధ్యాహ్నం 1.30 గంటల లోపు పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటున్నారు. బహుబలి క్రేన్ పాయింట్-4 వద్ద ఖైరతాబాద్ గణపతి నిమజ్జనం జరగనుంది. విగ్రహాల తరలింపునకు వాహనాలు లభించని వారికి పోలీసులే ఏర్పాటు చేస్తున్నారు. సీసీ కెమెరాలతో పాటు పెద్ద ఎత్తున హ్యాండ్ హెల్ట్ కెమెరాల్నీ వాడి ప్రతి ఘట్టాన్నీ చిత్రీకరించనున్నారు. బందోబస్తు కోసం నగర పోలీసులతో పాటు కేంద్రం, రాష్ట్ర సాయుధ బలగాలనూ మోహరిస్తున్నారు. విధుల్లో ఉండే సిబ్బందికి షిఫ్ట్ విధానం అమలు చేస్తూ వారికి అవసరమైన ఆహారం, మంచినీళ్లు అందిస్తున్నారు. పోలీసు అధికారులు ఇతర విభాగాలతో పాటు శాంతి, మైత్రి సంఘాలతో సమన్వయం కలిగి ఉండి పనిచేస్తున్నారు. ఇప్పటికే నగర పోలీస్‌కమిషనర్. జిల్లా కలెక్టర్, జిహెచ్ఎంసి కమిషనర్‌లు ఏర్పాట్లను పరిశీలించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ గణేష్‌నిమజ్జనానికి వచ్చేభక్తులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా అన్ని ఏర్పాట్లు పూర్తిచేసినట్లు తెలిపారు. జిహెచ్ఎంసి పరిధిలో 36 క్రేన్‌లను ఏర్పాటు చేశామని 15వేలమంది సిబ్బంది మూడుషిఫ్టుల్లో భక్తులకు సేవలందిస్తారని తెలిపారు ముఖ్యంగా శానిటేషన్, ఇంజనీరింగ్, యుబిడి, యుసిడి విభాగాలకు చెందిన సిబ్బంది పాల్గొంటారని తెలిపారు. నగరవ్యాప్తంగా నిమజ్జనానికి 10కంట్రోల్‌రూంలు, కమాండ్ కంట్రోల్ రూంలో అడిషనల్ కమిషనర్ స్థాయి అధికారులు మూడు షిఫ్టుల్లో పనిచేయనున్నట్లు తెలిపారు. మరుసటిరోజు మరో 500మంది సిబ్బందిని కూడా ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. నగర వ్యాప్తంగా 73 ప్రాంతాల్లో వినాయక పాండ్స్, పెద్దచెరువుల్లో నిమజ్జన ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అయితే నిమజ్జనానికి వచ్చేటప్పుడు కలర్‌పేపర్లు వేదజల్లడం వల్ల వాటిని శుభ్రం చేయడానికి శానిటేషన్ సిబ్బందికి ఇబ్బంది తలెత్తుతున్నందున భక్తులు అలాంటి కలర్ పేపరులన వెదజల్లకుండా శానిటేషన్ సిబ్బందికి సహకరించాలన్నారు. అలాగే 29వేలమంది పోలీస్ సిబ్బంది నిమజ్జన వేడుకలకు సేవలందించనున్నారు.

**64 చోట్ల ట్రాఫిక్ మళ్లింపు..**

మొత్తం నగరంలో 64 చోట్ల ట్రాఫిక్ డైవర్షన్‌లు ఉంటాయని పోలీసులు వెల్లడించారు. ట్యాంక్‌బండ్ సమీపంలో 8 చోట్ల పార్కింగ్ సదుపాయం కల్పించామన్నారు. ఉదయం 6 గంటల నుంచి ఆదివారం ఉదయం 8 గంటల వరకు ఈఆంక్షలు అమలులో ఉంటాయని తెలిపారు. బాలాపూర్ నుంచి గుర్రం చెరువు ట్యాంక్‌పై కట్టమైసమ్మ ఆలయం దగ్గర గణేష్ విగ్రహ ఊరేగింపు హైదరాబాద్ పోలీసు కమీషనరేట్ పరిధిలోకి ప్రవేశిస్తుందని కమీషనర్ తెలిపారు. కాబట్టి కేశవగిరి, చాంద్రాయణగుట్ట ఫ్లైఓవర్, ఎంబీఎస్ఆర్ ఎక్స్‌రోడ్డు మీదుగా మొహంజామార్కెట్, అబిడ్స్ ఎక్స్‌రోడు, బషీర్‌భాగ్, లిబర్టీ ఎక్స్‌రోడ్డు, ఎన్టీఆర్‌మార్గ్, పీవీఎన్ఆర్‌మార్గ్‌లో అంబేద్కర్ విగ్రహం వైపు వెళ్ళాలని ట్రాఫిక్ పోలీసులు సూచించారు.


గణేశ్ నిమజ్జనం సందర్భంగా సచివాలయం, ట్యాంక్‌బండ్ ప్రాంతాల్లో వెలుగుజిలుగులు



## స్థానిక సంస్థల్లో వైశ్యుల వాటా కోసం 9న 'సాధన దీక్ష'


వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న డా.కాచం సత్యనారాయణగుప్తా

**సైఫాబాద్, సెప్టెంబరు 5 ప్రభాతవార్త:** రాష్ట్రంలోని వైశ్యుల ఆత్మగౌరవం-హక్కుల సాధనకు స్థానిక సంస్థల ఎన్నికల్లో వైశ్యుల వాటా కోసం ఈ నెల 9వ తేదీన ఇందిరాపార్కు వద్ద 'సాధన దీక్ష' చేపడుతున్నామని వైశ్య వికాస వేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు డా.కాచం సత్యనారాయణగుప్తా తెలిపారు. ఈ మేరకు శుక్రవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఈ సాధన దీక్షకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. రాజకీయాలకు అతీతంగా జరిగే ఈ సాధన దీక్షలో వైశ్యులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. వైశ్యుల జనాభా దామాషా ప్రకారం అన్ని రాజకీయ పార్టీలు స్థానిక సంస్థల్లో తగినన్ని సీట్లు కేటాయించి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. సంఘం పేరు చెప్పుకుని కొంత మంది పదవులు అనుభవించి వైశ్య జాతికోసం, పేదల కోసం ఏలాంటి సహాయ సహకారాలు అందించడం లేదని విమర్శించారు. తమ సంస్థ ఏర్పడి 8 ఏళ్ళు గడిచిందని, వైశ్య కార్పోరేషన్ ఏర్పాటు కోసం ఎంతగానో కృషి చేసిందని వివరించారు. ఇటీవల వైశ్య రణభేరి కార్యక్రమాన్ని పది వేలమందితో నిర్వహించి పది డిమాండ్ల సాధన కోసం కృషి చేయడం జరి గిందని, వైశ్యులలో చైతన్యం తీసుకువస్తున్నామన్నారు. ఈ సమావేశంలో వేదిక కోశాధికారి కండె రాంనరేష్, ట్రస్ట్ సభ్యులు కొత్త రవి, కొత్తూరు వీరేందర్, ప్రవీణ్, రాజుగుప్తా, మనోహార్ తదితరులు

# మీన మేషాలు

(మెహిదీపట్నం-ప్రభాతవార్త)

రాష్ట్రంలో ఉచిత చేప పిల్లల పంపిణీ పథకం చతికిల పడుతోంది. చేప పిల్లల కొనుగోలుకు అయ్యే ఖర్చు అం తా ప్రభుత్వమే భరించి మత్స్యకారులకు ఆర్థిక వెసులు బాటు కల్పించాలన్న సంకల్పంతో ప్రవేశ పెట్టిన ఈ పథకం నిర్వహణ సర్కారుకు గుండిబండగా మారింది. పిల్లల పంపిణీకి సంబంధించి అంచనాలను ఘనంగా రూపొందించినా లక్ష్యం నెరవేర్చటంలో విఫలమ వుతోంది. గత ఏడాది రూ.90 కోట్ల అంచనా వ్య యంతో రాష్ట్రవ్యాప్తంగా 29,434 చెరువుల్లో సుమారు 90 కోట్ల చేపపిల్లలను వదలాలని రాష్ట్ర ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకున్నప్పటికీ..30 కోట్ల పిల్లలను మాత్ర మే పంపిణీ చేసింది. ఈ ఏడాది 90 కోట్ల చేపపిల్లలు, 10 కోట్ల రొయ్య పిల్లలను పంపిణీ చేయాలని నిర్ణయించిన మత్స్య శాఖ అధికారులకు టెండర్ల నిర్వహణ సవాల్‌గా మారుతోంది.

**చతికిలపడుతున్న ఉచిత చేప పిల్లల పంపిణీ**

**మత్స్యకారుల సబ్సిడీ ఆశలపై నీళ్లు**

**లక్ష్య సాధనలోనూ మత్స్యశాఖ విఫలం**

**గత ఏడాది 90 కోట్ల పిల్లలకు**

**30 కోట్ల పిల్లలను మాత్రమే పంపిణీ**

**రెండేళ్లుగా బిల్లుల చెల్లింపునకు బ్రేక్**

**రూ.109 కోట్ల బకాయిలు**

**ప్రభుత్వం ఉదాసీనత వీడాలని**

**మత్స్యకార సంఘాలు ఆగ్రహం**

**స్పందించకపోతే ఆందోళన**

**బాటచేపడతామని హెచ్చరిక**

సాధారణంగా జూన్ మొదటి వారం నాటికి చేప పిల్లల పంపిణీకి సంబంధించి టెండర్ల ప్రక్రియను పూర్తిచేయాలి. కానీ, గత రెండేళ్లుగా చేపపిల్లల సరఫరాకు సంబంధించి బిల్లులను సకాలంలో చెల్లించకపోవడంతో మూడు సార్లు టెండర్లు పిలిచినా కాంట్రాక్టర్లు ఎవరూ ముందు కురాలేదు. ఆలస్యంగా మేల్కొన్న మత్స్యశాఖ అధి కారులు పుణ్యకాలం గడిచాక కాంట్రాక్టర్లను ఒప్పిం చి..ఈనెల 9న మరోసారి టెండరు నిర్వహణకు సమాయత్త మవుతున్నారు. ఈ ఏడాది సమృద్ధిగా వర్షాలు కురిసి చెరువులు నిండినా.. చేప పిల్లల పంపి ణీ సకాలంలో జరగకపోవడంతో చెపల దిగుబడిపైనా నీలినీడలు కమ్ముకుంటున్నాయి. యేటా మత్స్యకారుల అభివృద్ధి కోసం ప్రధానమంత్రి మత్స్య సమృద్ధి యోజన (పిఎంఎంఎస్‌వై) పథకం ద్వారా 40 శాతం, రాష్ట్ర ప్రభుత్వం ఎన్.ఎస్.పి పథ కం ద్వారా 60 శాతం నిధులను విడుదల చేసు న్నాయి. దీంతో మత్స్యకారులకు వంద శాతం సబ్సిడీ అందుతుంది. అయితే ఈ సబ్సిడీ నిధులు కాగితాలకే పరిమితం అవుతున్నాయి. గత రెండు సంవత్సరాలుగా ఒక్క రూపాయి కూడా ప్రభుత్వం విడుదల చేయలేదని చేప పిల్లల ఉత్పత్తి రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. చేప పిల్లల పంపిణీలో తెలంగాణకు జాతీయ స్థాయిలో అవార్డు వచ్చినా..వాటిని పంపిణీ చేసిన మత్స్యకారుల బతుకుల్లో మాత్రం వెలుగు కనిపించటంలేదని వాపోతున్నారు.

బకాయి బిల్లుల కోసం హైకోర్టును ఆశ్రయించినా ప్ర యోజనం లేకపోవడంతో ఆందోళన బాట పట్టాల్సి వస్తోందని పేర్కొం టున్నారు.

**2023-24లో రూ.75 కోట్లు పెండింగ్**

2023-24 ఆర్థిక సంవత్సరంలో మత్స్య శాఖ ద్వారా 23 వేల 316 చెరువులలో చేప పిల్లలను పంపిణీ చేసేందుకు రూ.75 కోట్ల వ్యయంతో అప్పట్లో టెండరు నిర్వహించింది. ఈ టెండరు ప్రక్రియలో తెలంగాణ నుంచి 57, ఆంధ్రప్రదేశ్ నుంచి 23 మంది చేప పిల్లల పంపిణీ రైతులు పాల్గొన్నారు. తీరా చేప పిల్లలను పంపిణీ చేసిన తర్వాత బిల్లులను చెల్లించకపోవడంతో 70 మంది చేప పిల్లల ఉత్పత్తి రైతులు హైకోర్టును ఆశ్రయించారు. అయినా ప్రయోజనం లేకుండా పోయింది.

**గత ఏడాదీ అంతే..**

2024-25 ఆర్థిక సంవత్సరంలో మత్స్య శాఖ ద్వారా 17 వేల చెరువులలో చేప పిల్లలను పంపిణీ చేసేందుకు గాను రూ.34 కోట్ల వ్యయంతో టెండర్ నిర్వహించింది. దీనికి సంబంధించి రూ.34 కోట్ల నిధులు నేటికీ విడుదల కాలేదు.



**సర్కారు మాటలు నమ్మి రోడ్డున పడ్డాం**



ప్రభుత్వం అమలు చేస్తున్న ఎన్ఎఫ్‌డిబి, ఐఎఫ్‌డిఎస్ పథకాలకు ఆకర్షితులమై చేపల ఉత్పత్తి కోసం రెండు పంటలు పండించే భూ ములను చెరువులుగా మార్చుకున్నాం. గత రెండు సంవత్సరాలుగా బిల్లులు చెల్లించక పోవడంతో జీవనోపాధి పోయి రోడ్డున పడే పరిస్థితి దాపురించింది. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి పెండిం గ్‌లో ఉన్న రూ.109 కోట్ల బకాయిలు చెల్లించాలి. ప్రభుత్వం స్పందికచకపోతే ఆందోళన బాట చేపడతాం.

**- గుర్రాల మల్లేశం, ముదిరాజ్ మహాసభ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్**




**న్యాయం చేస్తాం**



చేప పిల్లల పంపిణీ దారుల బిల్లులు పెండింగ్‌లో ఉన్న మాట వాస్తవమే. ప్రభుత్వం ఈ పథకం నిర్వహణ పట్ల చిత్త శుద్ధితో ఉంది. రూ.109 కోట్ల నిధులను త్వరలోనే విడు దల చేస్తుంది. ఆందోళన చెం దాల్సిన అవసరం లేదు.

**- మెట్టు సాయి కుమార్ ఫిషరీస్ ఫెడరేషన్ చైర్మన్**


రామ్‌నగర్‌లో ఉపాధ్యాయులను సత్కరిస్తున్న హర్యానా రాష్ట్ర పూర్వ గవర్నర్ బండారుదత్తాత్రేయ

## ఆధునిక సమాజానికి అసలైన గురువు సర్వేపల్లి

**-హర్యానా పూర్వ గవర్నర్ బండారు దతాత్రేయ**

**చిక్కడపల్లి, సెప్టెంబరు 5 ప్రభాతవార్త:** రాజనీతి కోవిదుడు సర్వేపల్లి రాధాకృష్ణన్ అని హర్యానా పూర్వ గవర్నర్ బండారు దతాత్రేయ అన్నారు. శుక్రవారం రామ్‌నగర్‌లో బండారు దతాత్రేయ నివాసంలో భారత రాష్ట్రపతి సర్వేపల్లి రాధాకృష్ణన్ జన్మదినోత్సవం సందర్భంగా ఉపాధ్యాయ దినోత్సవ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా పలువురు ఉత్తమ ఉపాధ్యాయులను సత్కరించి అభినందించారు. అంతకుముందు సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించిన అనంతరం బండారు దత్తాత్రేయ మాట్లాడుతూ రాష్ట్రపతిగా దేశసేవ చేసిన భారత రత్నం అని, విద్యావేత్తగా, తత్వవేత్తగా విజయవంతమైన ప్రయాణాన్ని సాగించి ఘనచరిత్ర పుటల్లో నిలిచిన రాధాకృష్ణన్ దేశానికి చేసిన సేవ ఎనలేనిదన్నారు. ఆధునిక సమాజానికి ఎలాంటి గురువు అవసరమో, గురువు ఎలా ఉండాలో ఆయన స్వీయచరిత్ర తెలుపుతుందన్నారు.

# నిరంతర నిఘా



**నగర వ్యాప్తంగా సిసి, వీడియో కెమెరాల పర్యవేక్షణ**

**నిమజ్జనం సందర్భంగా ట్రాఫిక్ ఆంక్షలు**

**గతానికి భిన్నంగా ఏర్పాట్లు చేస్తున్న పోలీసులు**

**29 వేలమందితో పటిష్ట బందోబస్తు**

**హైదరాబాద్, సెప్టెంబరు 5, ప్రభాతవార్త:** భాగ్యనగరంలో గణేష్ నిమజ్జనం సందర్భంగా శనివారం, ఆదివారం ట్రాఫిక్ ఆంక్షలు విధించారు. హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాలలోని పలు ప్రాంతాలనుంచి పెద్ద ఎత్తున గణేష్ విగ్రహాలు హుసేన్ సాగర్ వైపు రానుండడంతో నగరవ్యాప్తంగా ట్రాఫిక్ ఆంక్షలను అమలు చేయబోతున్నారు. సిటీలో ట్రాఫిక్ రద్దీని తగ్గిండానికి సహకరించాలని సిటీ సీపీ ఇప్పటికే పలు మార్లు విజ్ఞప్తులు చేశారు. బాలాపూర్ నుంచి గుర్రం చెరువు ట్యాంక్‌పై కట్టమైసమ్మ ఆలయం దగ్గర గణేష్ విగ్రహ ఊరేగింపు హైదరాబాద్ పోలీసు కమీషనరేట్ పరిధిలోకి ప్రవేశిస్తుందని కమిషనర్ తెలిపారు. కాబట్టి కేశవగిరి, చాంద్రాయణగుట్ట ఫ్లైఓవర్, ఎంబీఎస్ఆర్ ఎక్స్‌రోడ్డు మీదుగా మొహంజామార్కెట్, అబిడ్స్ ఎక్స్‌రోడు, బషీర్‌భాగ్, లిబర్టీ ఎక్స్‌రోడ్డు, ఎన్టీఆర్‌మార్గ్, పీవీఎన్ఆర్‌మార్గ్‌లో అంబేద్కర్ విగ్రహం వైపు వెళ్ళాలని ట్రాఫిక్ పోలీసులు సూచించారు. అలాగే సికింద్రాబాద్ వైపునుంచి వచ్చే వినాయక విగ్రహ ఊరేగింపులు సంగీత్, ప్యాట్నీ, ప్యారడైజ్, ఎంజీరోడ్డు, ట్యాంక్‌బండ్ మీదుగా నెక్లెస్ రోడ్డుకు వెళ్ళనున్నాయి. ఇక చిలకలగూడ కూడలి నుంచి వచ్చే విగ్రహాలు గాంధీ ఆసుపత్రి, ఆర్టీసీ క్రాస్ రోడ్డు, నారాయణగూడ ఫ్లైఓవర్, వైజంక్షన్, హిమాయత్‌నగర్ నుంచి లిబర్టీ వైపు వెళతాయని పోలీసులు సూచించారు. దీంతో పాటు ఉప్పల్ నుంచి వచ్చే గణేష్ ఊరేగింపులు రామతపూర్, శ్రీరమణ జంక్షన్, చే నంబర్, తిలక్‌నగర్, ఓయూ, విద్యానగర్ జంక్షన్, ఫీవర్ ఆసుపత్రి, బర్కత్‌పుర జంక్షన్ మీదుగా వెళ్ళాలి. ఈ ఊరేగింపులు నారాయణగూడ వైఎంసీఏ జంక్షన్‌కు చేరుకుని ఆర్టీసీక్రాస్ రోడ్డునుంచి వచ్చే ఊరేగింపుతో కలవనుంది.


హైదరాబాద్ పోలీసు విభాగంలో మహిళా అశ్విక దళం ప్రారంభం సందర్భంగా మహిళా పోలీసులతో కొత్వాల్ ఆనంద్

## హైదరాబాద్ పోలీసు విభాగంలో మహిళా అశ్విక దళం

**రెండు నెలల పాటు కఠోర శిక్షణ - నేటి గణేశ్ బందోబస్తులో సేవలకు శ్రీకారం**

**హైదరాబాద్, సెప్టెంబరు 5, ప్రభాతవార్త:** హైదరాబాద్ పోలీసు విభాగంలో మహిళలకు మరో గౌరవం దక్కింది. పురుష పోలీసుతో సమానంగా అ న్ని రంగాలలో దూసుకుపోతున్న మహిళా పోలీసులు అశ్విక విభాగంలో ప్రత్యేక స్థానం పొందారు. సిటీ సాయుధ బలగంలో ఇప్పటి వరకు పురుష అశ్విక విభాగం మాత్రమే వుండగా మహిళా అశ్విక విభాగం కూడా ఇకముందు సేవలందించనుంది. ఈ విభాగాన్ని సిటీ కొత్వాల్ ఆనంద్ శుక్రవారం నాడు గోషామహల్‌లోని సిటీ మౌంటెడ్ పోలీసు విభాగంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిటీ పోలీసు విభాగంలో మహిళా అశ్విక విభాగం ఏర్పాటవడం తలమానికమని అన్నారు. మహిళా అశ్విక విభాగం సిబ్బంది పురుష పోలీసులకు ధీటుగా విధులు నిర్వహించ నున్నారని ఆయన తెలిపారు. శనివారం నాడు జరిగే గణేష్ నిమజ్జన వేడుకల సందర్భంగా మహిళా అశ్విక దళ విభాగం బందోబస్తులో పాల్గొంటుందని ఆనంద్ తెలిపారు. మహిళా అశ్విక దళంలో ఎంపికైన సిటీ సాయుధ బలగంలోని మౌంటెడ్ పోలీసు విభాగంలో మహిళా కానిస్టేబుళ్లు రెండు నెలల పాటు కఠోర శిక్షణను తీసుకున్నారని ఆయన తెలిపారు. ఈ శిక్షణలో వీరంతా అనేక అంశాలపై తర్ఫీదును పొందారని కమిషనర్ తెలిపారు. గణేష్ బందోబస్తు మాత్రమే కాకుండా విఐపిల బందోబస్తు సాధారణ గస్తీలకు కూడా మహిళా అశ్విక దళ సిబ్బంది తమ సేవలను అందిస్తారని ఆ యన తెలిపారు. మహిళలు అన్ని రంగాలలో ముందంజ వేయాలనే ఈ నిర్ణయం తీసుకున్నామని కమిషనర్ చెప్పారు. మహిళా అశ్విక దళంతో పాటు సిటీ పోలీసు జాగిలాల విభాగం నూతన వింగ్‌ను కూడా కమిషనర్ ప్రారంభించారు. మొయినాబాద్‌లోని పోలీసు జాగిలాల శిక్షణా సంస్థలో ఈ జాగిలాలు శిక్షణ పొందాయని ఈ సందర్భంగా ఆనంద్ తెలిపారు. పోలీసు విభాగంలో జాగిలాల విధులు కీలకంగా వుంటాయని ఆయన తెలిపారు. పేలుడు పదార్థాల గుర్తింపు సహా నేరగాళ్ల పట్టివేత వంటి అనేక అంశాలలో పోలీసులకు జాగిలాలు సహకరిస్తాయని ఆయన తెలిపారు. గోషామహల్ పోలీసు గ్రౌండ్స్‌లో చాలా వరకు స్థలం ఉస్మానియా ఆసుపత్రి కోసం సర్కారు తీసుకున్నందున మిగిలిన 11.5 ఎకరాలలో కొత్త భవనాలను నిర్మిస్తున్నామని ఆనంద్ తెలిపారు. ఈ కార్యక్రమంలో సాయుధ బలగం డిసిపి రక్షిత మూర్తితో పాటు దక్షిణ పశ్చిమ మండల డిసిపి చంద్రమోహ న్, దక్షిణ, తూర్పు మండల డిసిపి ధార కవిత తదితరులు పాల్గొన్నారు.

## తెలుగు భాష సంస్కృతికి మండలి ప్రతీక

**మాజీ కేంద్ర మంత్రి డాక్టర్ సముద్రాల వేణుగోపాల చారి**

**చిక్కడపల్లి సెప్టెంబరు 5, ప్రభాతవార్త :** మండలి వెంకట కృష్ణారావు తెలుగు భాష సంస్కృతికి ప్రతీక అని పలువురు ప్రముఖులు కీర్తించారు. ఆయన నిర్మలమైన ప్రజా సేవకుడు భాషా ప్రేమికుడు అని అన్నారు. శుక్రవారం చిక్కడపల్లి శ్రీ త్యాగరాయ గానసభలో కమలాకర మెమోరియల్ చారిటబుల్ ట్రస్ట్, కమలాకర లలిత కళాభారతి, నిర్వాహక సంస్థ వ్యవస్థాపక అధ్యక్షురాలు భారతి కమలాకర్ సంయుక్త ఆధ్వర్యంలో మండలి వెంకట కృష్ణ రావు శతజయంతి సందర్భంగా ప్రముఖ నాటక రచయిత డాక్టర్ డి.విజయభాస్కర్ కు మండలి స్మారక పురస్కారం, లండన్‌లో తొలి భారతీయ డిప్యూటీ మేయర్ ఉదయ్ ఆరేటి లకు పురస్కారాల ప్రదానోత్సవ సభ ధర్మప్రచారకులు ఆచార్య కసిరెడ్డి వెంకట రెడ్డి అధ్యక్షతన జరిగింది. విశిష్ట అతిథిగా ఏపి ఎమ్మెల్యే అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ హాజరై మాట్లాడారు.


పురస్కారాలను ప్రదానం చేస్తున్న ఏపి ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్, ఆచార్య కసిరెడ్డి వెంకటరెడ్డి తదితరులు



ఉపాధ్యాయుడిని సన్మానిస్తున్న పిఆర్‌టియు నేతలు

## ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవం

**గజ్వేల్ టౌన్, సెప్టెంబర్ 5 (ప్రభాతవార్త):** సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకొని శుక్రవారం పిఆర్‌టియు గజ్వేల్ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వంటేరు సత్యనారాయణరెడ్డి, తీగుళ్ల లింగం గౌడ్ ఆధ్వర్యంలో ప్రజ్ఞాపూర్‌లోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మండల పరిధిలోని పలువురు ఉపాధ్యాయులను సన్మానించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విచ్చేసిన పిఆర్‌టియు జిల్లా అధ్యక్షుడు మల్లుగారి ఇంద్రసేనారెడ్డి, గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు కరీమొద్దీన్, ఏ.సుగుణాకర్, భాస్కర్, బసవరాజ్, సుధాకర్‌రెడ్డి, శ్రీశైలంలు మాట్లాడుతూ డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ గొప్ప మేధావి, తత్వవేత్త అని, ఉపాధ్యాయ వృత్తి నుండి దేశంలో అత్యున్నతమైన రాష్ట్రపతి పదవి చేపట్టిన మహోన్నత వ్యక్తి అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో సుధాకర్‌రెడ్డి, శ్రీశైలం, బాలమణి, గఫార్, ప్రవీణ్‌కుమార్, హనుమంతరెడ్డి, శ్రీశైలం, మోహన్‌రావులను సన్మానించగా రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు ఏ.కనక రాములు, ఎండి.బషీరుద్దీన్, కె.నరసింహారెడ్డి, శివశంకర్, వేమారెడ్డి, బాలు, చరణ్, శేఖర్, పోచయ్యగౌడ్, శ్రీనివాస్, మధుసూదన్‌రెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షులు యాదగిరి, నాగరాజు, వెంకటేశంగౌడ్, కార్యదర్శులు శోభా రాణి, జీవన్‌రెడ్డి, మండల ఉపాధ్యక్షులు కవిత, కార్యదర్శి దిలీప్‌కుమార్ పాల్గొన్నారు.

**శిశుమందిర్‌లో...**



ఉపాధ్యాయులను సన్మానిస్తున్న దృశ్యం

**పెద్దశంకరంపేట, సెప్టెంబర్ 5, ప్రభాతవార్త :** శ్రీసరస్వతి శిశుమందిర్‌లో శుక్రవారం ఉపాధ్యాయ దినోత్సవవేడుకలు ఘనంగా జరుపుకున్నారు.. ఈ సందర్భంగా మండల విద్యాధికారి డి వెంకటేశం.. ప్రధానాచార్యులు వీరప్ప.. ఆచార్యులు జైహింద్ రెడ్డి, శ్రీనివాస్ లక్ష్మీనారాయణ.. సంస్కార్ విద్యాలయం కరస్పాండెంట్ సీతారామారావు లను శిశు మందిర్ పాఠశాల అధ్యక్ష ప్రధానకార్యదర్శులు శాలువాలతో సన్మానించారు. ఈ సందర్భంగా మండల విద్యాధికారి వెంకటేష్ మాట్లాడుతూ విద్యార్థులను తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకమన్నారు.. ఈ కార్యక్రమంలో శిశు మందిర్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు దాదిగారి గంగాధర్.. క్రాంతి లాల్. ఉపాధ్యక్షుడు జంగం రాఘవులు. ప్రబంధ కారిని సభ్యులు పునయ్య.. శ్రావణ్ కుమార్.. రవి వర్మ . గాండ్ల సంగమేశ్వర్.. వెంకట్ రాములు, మునిగేల సంగమేశ్వర్ ఆచార్య బృందం విద్యార్థులు పాల్గొన్నారు

## ఘనంగా సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి



రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పిస్తున్న దృశ్యం

**పాపన్నపేట, సెప్టెంబర్ 5, ప్రభాతవార్త :** తరగతి గదిలో దేశ భవితను తీర్చిదిద్దే మార్గదర్శకులు, సమాజానికి జ్ఞానాన్ని పంచుతున్న గురువులని శ్రీవిద్య పాఠశాల ప్రిన్సిపల్ రవీందర్ అన్నారు. శుక్రవారం సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఉపాధ్యాయులుతో కలిసి ఘనంగా నివాళులర్పించారు. దేశ భవిష్యత్ గురువు చేతిలోనే ఉందన్నారు. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ నిటలాక్షప్ప... సుమన్, ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ఐకమత్యంతోనే అనుకున్న లక్ష్యాలను సాధించుతాం



మాట్లాడుతున్న మలిపెద్ది శంకర్

**సిద్దిపేట రూరల్, సెప్టెంబర్ 5, ప్రభాతవార్త :** ఐకమత్యంతోనే అనుకున్న లక్ష్యాలను సాధించుతామని ఆవోప(ఆర్యవైశ్య అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్ అసోసియేషన్) రాష్ట్ర అధ్యక్షులు మలిపెద్ది శంకర్ అన్నారు. జిల్లా కేంద్రంలో శుక్రవారం నిర్వహించిన ఆవోపా సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఆర్యవైశ్యులో ఉన్న పేదవారికి చేయూతనిచ్చి ఉన్నత స్థాయికి చేర్చాలని కోరారు. ఆర్యవైశ్యులకు ఉన్న సంపదను, తెలివితేటలను పేదల శ్రేయస్సు కోసం వినియోగించాలన్నారు.

### ఆవోపా నూతన కార్యవర్గం

అవోపా అధ్యక్షులుగా గెజిటెడ్ హెచ్ఎం గుండ వేణుగోపాల్, ప్రధాన కార్యదర్శిగా పెద్ది విఠల్, ఫైనాన్స్ కార్యదర్శిగా న్యాయవాది చంద్రశేఖర్, ఉపాధ్యక్షులుగా డాక్టర్ కాచం జగదీశ్వర్, డాక్టర్ ఐత శివ, న్యాయవాది కొమురవెల్లి మహేష్, మురికి శ్రీనివాస్, కార్యదర్శులుగా న్యాయవాది శ్రీకాంత్, సతీష్‌కుమార్, ఉప్పలంచ భూమ్రాజ్, కార్యవర్గ సభ్యులుగా రవికిరణ్,నాగేందర్‌లను ఎన్నుకున్నారు. అనంతరం రాష్ట్ర ఆవోపా అధ్యక్షులు శంకర్‌ను శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఆర్యవైశ్య మహాసభ జిల్లా అధ్యక్షులు గంప శ్రీనివాస్, నాయకులు అయిత కిషోర్, యాసాల వెంకటలింగం, గరిపెట్టి సిద్దేశ్వర్,మాంకాల లింగమూర్తిల ఆధ్వర్యంలో ఎన్నిక నిర్వహించారు.కార్యక్రమంలో వైకుంఠం, బెజగం వెంకటేశం, డాక్టర్లు, న్యాయవాదులు, వివిధ వృత్తుల ప్రతినిధులు పాల్గొన్నారు.

## గోపాలమిత్ర ఉపాధ్యక్షులుగా డప్పు మాణిక్యం

**పుల్‌కల్, సెప్టెంబరు 5, ప్రభాతవార్త:**

మండలపరిధిలోని ముదిమాణిక్యం గ్రామానికి చెందిన డప్పు మాణిక్యంను గోపాలమిత్ర సంఘం జిల్లా ఉపాధ్యక్షులుగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. శుక్రవారం జరిగిన సంఘం సమావేశంలో జిల్లా కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంఘం అధ్యక్షులుగా గంప శివకుమార్, ఉపాధ్యక్షులుగా డప్పు మాణిక్యం, ప్రధాన కార్యదర్శిగా అలిగే శ్రీకాంత్‌లను ఎన్నుకున్నారు. జిల్లాలో గోపాలమిత్రలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి తన వంతు చర్యలుతీసుకుంటానని డప్పు మాణిక్యం పేర్కొన్నారు. కార్యక్రమంలో పర్యవేక్షకులు, గోపాలమిత్రలు పాల్గొన్నారు.

## అల్లాదుర్గంలో ప్రధాని చిత్రపటానికి క్షీరాభిషేకం

**అల్లాదుర్గం, సెప్టెంబరు 5 ప్రభాతార్త :** మండల కేంద్రంలోని బస్టాండ్‌లో శుక్రవారం భారతీయ జనతా పార్టీ నాయకులు భారత ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ చిత్రపటానికి పూలమాలలు వేసి పాలతో అభిషేకం చేశారు. ప్రజలకు భారం అవతున్న పలు వస్తువులపై ఈ జిఎస్‌టిని పూర్తిగా ఎత్తేయడం, మరి కొన్నింటిపై తగ్గిస్తూ నిర్ణయించడం ఆనందంగా ఉందని నాయకులు ఆనందం వ్యక్తం చేశారు. జిఎస్‌టి తగ్గిపు, రద్దుతో పేదలు ప్రయోజనాలు అందుకుంటారన్నారు. కార్యక్రమంలో బిజెవైఎం అధ్యక్షులు బాలరాజు, కోశాధికారి నీలి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రైవేటుకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు

**వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ**

**నారాయణఖేడ్, సెప్టెంబర్ 5 ప్రభాతవార్త**

ప్రైవేటుకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన సౌకర్యాలు కల్పిస్తున్నామని వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ అన్నారు. శుక్రవారం నారాయణఖేడ్‌లోని ఫంక్షన్‌హాల్‌లో జాతీయ ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఉపాధ్యాయ అవార్డుల ప్రదాన కార్యక్రమానికి జహీరాబాద్ పార్లమెంట్ సభ్యులు సురేష్ షెట్కర్, ఎమ్మెల్యే డాక్టర్ సంజీవరెడ్డి, నారాయణఖేడ్ సబ్ కలెక్టర్ ఉమాహారతితో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, ఉపాధ్యాయుడిగా జీవితాన్ని ప్రారంభించింది దేశ అత్యున్నత స్థానమైన రాష్ట్రపతి పదవిని అలంకరించిన దివంగత రాష్ట్రపతి సర్వేపల్లి రాధాకృష్ణన్ జన్మదినన్ని పురస్కరించుకొని ప్రభుత్వం ప్రత్యేక సెప్టెంబర్ ఐదును జాతీయ ఉపాధ్యాయ దినోత్సవంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా సర్వేపల్లి రాధాకృష్ణ చిత్రపటానికి మంత్రి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మనదేశంలో గురువుకు తల్లి దండ్రుల తర్వాత స్థానం ఇచ్చారన్నారు. గురువులు తమ విద్యార్థులకు మార్గదర్శకులుగా నిలవాలన్నారు. దేశ భవిష్యత్తు తరగతి గదుల్లోనే నిర్మాణం అవుతుందని అని అన్నారు. ఒక ఇంజనీరు ప్రాజెక్టులో నిర్మిస్తే సైంటిస్టు రాకెట్లను తయారుచేస్తే డాక్టర్ వైద్యం చేస్తాడు కానీ వీరందరిని తయారు చేసేది ఉపాధ్యాయులు అన్నారు. సమాజానికి ఉపయోగపడే విధంగా తమ విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దేది ఉపాధ్యాయులని గురుకు సమాజంలో అత్యున్నత స్థానం ఉందన్నారు సమాజ నిర్మాతలు మార్గదర్శకులు ఉపాధ్యాయులు అన్నారు. విద్యార్థి జీవితాన్ని మలుపు తిప్పేది ఉపాధ్యాయులేనని అన్నారు. రాష్ట్రంలో నాణ్యమైన అందించడానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారథ్యంలోని ప్రజా ప్రభుత్వం పనిచేస్తుందన్నారు 10 సంవత్సరాల తర్వాత మొదటిసారిగా ప్రభుత్వ సంక్షేమ



ఉపాధ్యాయులను సన్మానిస్తున్న మంత్రి దామోదర రాజనర్సింహ.

వసతి గృహాలు రెసిడెన్షియల్ పాఠశాలలో చదివే విద్యార్థులకు డైట్ చార్జీలను 40!! కాస్మోటిక్ చార్జీలను 200!! పెంచిందన్నారు. రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలకు ఉచిత విద్యుత్ ను ప్రభుత్వం అందిస్తున్నట్లు తెలిపారు. అన్ని వర్గాల పిల్లలు కలిసిమెలిసి చదువుకోవడానికి అంతర్జాతీయ ప్రమాణాలతో ప్రతి నియోజకవర్గంలో 200 కోట్లతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ప్రజా ప్రభుత్వం వచ్చాకే డీఎస్సీ నిర్వహించి ఉపాధ్యాయ నియామకాలు చేపట్టిందన్నారు. ప్రజా ప్రభుత్వం రాష్ట్రంలోని అన్నియూనివర్సిటీలకు నియమించింది అన్నారు విద్యార్థుల సమస్యల పరిష్కారం కోసం దేశంలోని మొట్టమొదటిసారిగా విద్యా కమిషన్ రాష్ట్రంలో ఏర్పాటు చేసిన ఘనత ప్రజా ప్రభుత్వానికి దక్కుతుందని. యువతలో నైపుణ్యాల పెంపు కోసం స్కిల్ యూనివర్సిటీని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఏర్పాటుచేసినట్లు తెలిపారు. రాష్ట్రంలో విద్యారంగ అభివృద్ధికి పేదల బంగారు భవిష్యత్తు ప్రజా ప్రభుత్వం కృషిచేస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పించడం ప్రజాప్రతినిధులుగా తమ బాధ్యత అని విద్యను నేర్పి తమ విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చి దిద్దాల్సిన బాధ్యత ఉపాధ్యాయులది అని ఈ సందర్భంగా మంత్రి ఉపాధ్యాయులకు సూచించారు. ప్రభుత్వం కల్పిస్తున్న వసతులను ఉపాధ్యాయులు బోధించే విద్యను ఉపయోగించుకొని జీవితంలో ఉన్నత శిఖరాలకు ఎదగడం విద్యార్థుల బాధ్యత అని అన్నారు. ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకొని జీవితంలో ఉన్నపుడు చేరాలని ఈ సందర్భంగా మంత్రి కోరారు. ఈ సందర్భంగా ఉత్తమ ఉపాధ్యాయుల ఎంపికైన అధ్యాపకులను మంత్రి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో నారాయణఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి, ఎంపీ సురేష్‌షట్కర్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.



ఉపాధ్యాయులను సన్మానిస్తున్న ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి

## ఉపాధ్యాయులకు సన్మానం

**గజ్వేల్ టౌన్, సెప్టెంబర్ 5 (ప్రభాతవార్త):** ఉపాధ్యాయుల దినోత్సవం సందర్భంగా శుక్రవారం గజ్వేల్ పట్టణంలోని శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయ విఘ్నేశ్వర కమిటీ ఆధ్వర్యంలో పలువురు ఉపాధ్యాయులను ఉమ్మడి మెదక్ జిల్లా ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ ఎన్‌సి.రాజమౌళి చేతులమీదుగా సన్మానించి మెమొంటోలు అందజేశారు. ఈ కార్యక్రమంలో సిద్దిపేట జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు ఎన్‌సి.సంతోష్, ఉపాధ్యాయులు వేమారెడ్డి, రామకృష్ణ, సంగీత, బిక్షపతి, పోచయ్య, శ్రీనివాస్, గాలయ్య, శ్రీనివాస్, చంద్రశేఖర్, లావణ్య, విద్యారాణి, సాహితి, ఫ్రెండ్స్ ఫర్ యు అసోసియేషన్ సభ్యులు, విఘ్నేశ్వర కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

### గురుకుల పాఠశాలలో ఉపాధ్యాయ దినోత్సవం

**నర్సాపూర్, సెప్టెంబర్ 5, ప్రభాతవార్త:** అల్లూరి సీతారామరాజు గిరిజన గురుకుల పాఠశాలలో శుక్రవారం ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఈసందర్భంగా డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈమేరకు ఈ గురుకుల పాఠశాలలో ఉపాధ్యాయులు ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవాన్ని జరుపుకున్నారు..ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ క్రిష్ణ కిషోర్ , ఉప ప్రధానోపాధ్యాయుడు బసవరాజ్ ఉపాధ్యాయుల బృందం తదితరులు పాల్గొన్నారు.

## బి.ఎన్.నారాయణరావుకు జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు

**సదాశివపేట, సెప్టెంబరు 5, ప్రభాతవార్త:**

మండలంలోని కంబాలపల్లి గ్రామంలోని ఎంపి యుపిఎస్ ఉన్నతపాఠశాలలో విధులు నిర్వహిస్తున్న బిఎన్.నారాయణరావు సేవలను గుర్తించి శుక్రవారం గురుపూజోత్సవం సందర్భంగా సంగారెడ్డి జిల్లా కలెక్టరేట్‌లోని ఆడిటోరియం కార్యాలయంలో కలెక్టర్ ప్రావీణ్య, ఆర్డిఓ శైలజ, జిల్లా విద్యాధికారి వెంకటేశ్వర్లు, టిజిఐఐసి చైర్మన్ నిర్మలజగ్గారెడ్డి, ఎమ్మెల్సీ అంజిరెడ్డి చేతుల మీదగా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డును అందుకోవడం జరి గింది. ఈ సందర్భంగా బిఎన్.నారాయణరావు మాట్లాడుతూ, విద్యతోనే విలువలు పెరుగుతాయని, నాసేవను గుర్తించే జిల్లా అధికారులు, ప్రజా ప్రతినిధుల చేతుల మీదగా ఉత్తమ అవార్డు రావడం సంతోషకరమన్నారు. నాకు అవార్డు అందజేసిన జిల్లా అధికారులకు, ప్రజాప్రతినిధులకు కృతజ్ఞత లు తెలియజేసుకొంటున్నానని తెలిపారు.



బిఎన్ శంకర్‌రావును సన్మానిస్తున్న జిల్లా కలెక్టర్ ప్రావీణ్య

## హరీష్‌రావుపై ఆరోపణలు తగవు

**-బిఆర్ఎస్ నాయకులు చిమ్ముల గోవర్ధన్‌రెడ్డి**

**గుమ్మడిదల, సెప్టెంబరు 5, ప్రభాతవార్త:**

బిఆర్ఎస్ నాయకులు, మాజీ మంత్రి హరీష్‌రావుపై చేస్తున్న ఆరోపణలకు స్థానం లేదని ఆ పార్టీ నేత చిమ్ముల గోవర్ధన్‌రెడ్డి అన్నారు. తెలంగాణ రాష్ట్ర సాధనలో హరీష్‌రావు పోషించిన కీలకపాత్రను ఎవరూ మరచిపోలేరని గుర్తు చేశారు. శుక్రవారం గుమ్మడిదలలో సిజిఆర్ ట్రస్ట్ కార్యాలయంలో మాట్లాడుతూ తెలంగాణ ఆవిర్భావానికి ముందు జరిగిన ప్రతిదశలో మానాయకుడు హరీష్‌రావు ముందుం డి ఉద్యమాన్ని నడిపించారని, తెలంగాణ ప్రజల హక్కుల కోసం ఎన్నో త్యాగాలు చేశారని చెప్పారు. ప్రజలకు దగ్గరైన నాయకుడిగా హరీష్‌రావు ఎల్లప్పుడూ అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలు కోసం కృషి చేశారని గోవర్ధన్‌రెడ్డి అన్నారు. ముఖ్యంగా రైతుల సమస్యల పరిష్కారం, సాగు నీటి ప్రాజెక్టులు, మిషన్ భగీరథ, మిషన్ కాకతీయ వంటి పథకాల రూపకల్పనలో హరీష్‌రావు అహ ర్నిశలు శ్రమించారని గుర్తుచేశారు. ఇలాంటి నాయ కుడిపై తప్పుడు ఆరోపణలు చేయడం సరైన పద్ధతి కాదని అన్నారు. ప్రజలు నమ్మేవిధంగా లేదని అన్నారు. బిఆర్ఎస్ బలపడటానికి, ప్రజల మనసులు గెలుచుకోవడానికి హరీష్‌రావు చేసిన కృషి మరువరానిదని తెలంగాణ ప్రజలలో హరీష్‌రావు గుండెల్లో ఉంటాడని గుర్తుచేశారు. తెలంగాణ ఉద్యమంలో ఆయన చూపిన దృఢసంకల్పం, ప్రజలతో కలిసిమెలిసి పోరాడినతీరు రాష్ట్ర చరిత్రలో నిలిచిపోతుందని చెప్పారు. హరీష్‌రావు లాంటి ఉద్యమ సారథులు ఉండడం బిఆర్ఎస్‌కు గర్వ కారణం అని తెలిపారు. రాజకీయ ప్రయోజనాల కోసం కొందరు చేస్తున్న ఆరోపణలు కేవలం ప్రచారం కోసం మాత్రమే అని అన్నారు. కాని తెలంగాణ ప్రజలు వాస్తవాన్ని గ్రహిస్తారని, ప్రజలు వచ్చే ఎన్నికలలో గట్టిగా బుద్ధిచెప్తారని చిమ్ముల గోవర్ధన్‌రెడ్డి స్పష్టం చేశారు. కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

### పేదలకు వరం సిఎం సహాయనిధి : ఎమ్మెల్యే

**నర్సాపూర్, సెప్టెంబర్ 5, ప్రభాతవార్త:** ముఖ్యమంత్రి సహాయనిధి పేదలకు వరంలాంటిదని ఎమ్మెల్యే సునీతరెడ్డి అన్నారు. శుక్రవారం హైదరాబాదులోని తన నివాస గృహంలో లబ్ధిదారుల కుటుంబ సభ్యులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేశారు. చిలిపిచేడ్ మండలం గౌతాపూర్ రత్నతండాకు చెందిన సామ్యరత్నాకు మంజూరైన రూ. 18వేల చెక్కును, ఎండ్ల లక్ష్మికి రూ.12 వేల చెక్కును ఎమ్మెల్యే సునీత కుటుంబసభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో టిఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు

### ఎల్లయ్య మృతి కార్మిక రంగానికి తీరని లోటు : ఎమ్మెల్యే

**అమీన్‌పూర్, సెప్టెంబర్ 5 ప్రభాతవార్త :** కార్మిక నాయకుడు, తెలంగాణ ఉద్యమకారుడు ఎల్లయ్య మరణం కార్మిక రంగానికి తీరని లోటని పటాన్ చెరువు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ భూపాల్ రెడ్డి, అన్నారు. ఎల్లయ్య మరణ వార్త తెలిసిన వెంటనే..అమీన్పూర్ మున్సిపల్ పరిధిలోని కృష్ణారెడ్డి పేట గ్రామ పరిధిలో గల ఎల్లయ్య నివాసానికి వెళ్లి ఆయన పార్థివ దేహానికి ఘన నివాళులు అర్పించారు. బిహెచ్ఇఎల్ తో పాటు వివిధ పరిశ్రమల్లో కార్మికుల సంక్షేమం, హక్కుల కోసం పోరాడిన మహోన్నత నాయకుడు ఎల్లయ్య అని కొనియాడారు. ఆయన జీవితం ప్రతి ఒక్కరికి ఆదర్శ ప్రాయమని అన్నారు. భగవంతుడు వారి ఆత్మకు శాంతి కలగాలని ప్రార్థిస్తున్నట్లు తెలిపారు. కుటుంబ సభ్యులకు, అభిమానులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

### మార్గదర్శకాన్ని సూచించిన గురువుకి సన్మానం

**సదాశివపేట, సెప్టెంబరు 5, ప్రభాతవార్త:**

ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా శుక్రవారం సదాశివపేటలోని శిష్యుని గృహమునందు గురుపూజోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా ముబారక్‌పూర్ గ్రామంలో ఉపాధ్యాయవృత్తిని కొనసాగిస్తున్న కిష్టయ్యకు 1983-84 బ్యాచ్ పదవతరగతి మిత్రబృందం అధ్యక్షుడు గంట శివయ్యతోపాటు పృథ్వీరాజ్, వీరేశం, సంగమేశ్వర్, నందు, రవి, వెంకట్రావు, శంకర్ మొదలగువారు పూలమాలలు, శాలువాతో ఘనంగా సన్మానించి వారి ఆశీర్వాదం తీసుకున్నారు. ఈసందర్భంగా కిష్టయ్య మాట్లా డుతూ నన్ను సన్మానించడం చాలా ఆనందంగా ఉందని, మీమిత్రులు ఏ కార్యక్రమం చేసినా బాగుంటుందని అన్నారు. మీరు చేసే కార్యక్రమాలలో తాను కూడా భాగస్వామిని అవుతానని ఈసందర్భంగా వారు అన్నారు.

# రైతాంగానికి సరిపడా యూరియాను అందించాలి

**మాజీ ఎమ్మెల్యే వొడితల సతీష్‌కుమార్**

**హుస్నాబాద్ రూరల్, సెప్టెంబరు 5, ప్రభాతవార్త**

రైతాంగానికి కావాల్సిన యూరియాను ప్రభుత్వం వెంటనే తెప్పించి పంపిణీ చేయాలని హుస్నాబాద్ మాజీ ఎమ్మెల్యే వొడితల సతీష్‌కుమార్ డిమాండ్‌చేశారు. శుక్రవారం పట్టణంలోని బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో గణపతి నవరాత్రోత్సవాలలో భాగంగా ఏర్పాటు చేసిన విఘ్నేశ్వరునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నియోజకవర్గ రైతులు పంటలు సాగు చేసుకుని పంటకు కావాల్సిన యూరియా కోసం క్యూలో నిలబడినా అందడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారని, ప్రభుత్వం సమయానికి ఎరువులు అందించకుంటే పంట దిగుబడి తగ్గిపోయి వారు పెట్టిన పెట్టుబడి రాక నష్టపోయే ప్రమాదం ఉందన్నారు. ఈ విషయంలో మంత్రి పొన్నం ప్రభాకర్ చొరవ తీసుకుని రైతాంగానికి సరిపడే మేరకు యూరియా తెప్పించి అందించాలన్నారు. లేనిపక్షంలో బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో పెద్దఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షులు అన్వర్, మండల అధ్యక్షులు గంగం మదన్‌మోహన్‌రెడ్డి, నియోజకవర్గ అధికార ప్రతినిధి అయిలేని మల్లిఖార్జునరెడ్డి, మున్సిపల్ మాజీ చైర్మన్ ఆకుల రజితవెంకన్న, వైస్ చైర్మన్ అయిలేని అనిత శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ఎఎంసి చైర్మెన్ రజిని తిరుపతిరెడ్డి, నాయకులు వంగ వెంకటరామిరెడ్డి, బండి రమణారెడ్డి, వాల నవీన్‌రావు సుప్రజతో పాటు తదితరులు ఉన్నారు.



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే సతీష్‌కుమార్



మోడి చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న బిజెపి నాయకులు

## నరేంద్రమోడి చిత్రపటానికి క్షీరాభిషేకం

**గజ్వేల్ టౌన్, సెప్టెంబర్ 5 (ప్రభాతవార్త):** జిఎస్టీ తగ్గించడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ బిజెపి నాయకులు శుక్రవారం గజ్వేల్‌లోని బిజెపి కార్యాలయం వద్ద ప్రధాని నరేంద్రమోడి చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు జశ్వంత్‌రెడ్డి, రాంరెడ్డి, ఉప్పల మధుసూదన్, లక్ష్మినరసింహారెడ్డి, సిలివేరి జనార్ధన్, ఏగొండ, పవన్, దేవేందర్, నరసింహాచారి, ఉమ, సుమతి, మమత పాల్గొన్నారు.

**పాపన్నపేటలో...**



మోడీ చిత్ర వటానికి క్షీరాభిషేకం చేస్తున్న దృశ్యం

**పాపన్నపేట, సెప్టెంబర్ 5, ప్రభాతవార్త :** జీఎస్టీని తగ్గించి పేదలు, మధ్యతరగతి వర్గాలకు ప్రయోజనం కలిగించినందుకు పాపన్నపేటలో శుక్రవారం బీజేవి నాయకులు జెండా ఎగుర వేసి,ప్రధాని మోడీ చిత్రపటానికి పాలాభిషేకంచేశారు. కార్యక్రమంలో బీజేపి మండలఅధ్యక్షులు సంతోష్చరి, మాజీ అధ్యక్షుడు బీకొండ రాములు, శంకరయ్య, మండల ప్రధాన కార్యదర్శి నాగభూషణం, మల్లేశం, వెంకట్, వడ్ల భాగేష్, ప్రకాష్ పాల్గొన్నారు.

## వినాయక నిమజ్జనానికి పటిష్ట భద్రత

**జిల్లా గ్రంధాలయ చైర్మన్ కేడం లింగమూర్తి**

**హుస్నాబాద్ రూరల్, సెప్టెంబరు5, ప్రభాతవార్త :** పట్టణంలోని ఎల్లమ్మ చెరువులో ఏర్పాటు చేసిన వినాయక నిమజ్జనానికి పటిష్ట భద్రతతో పాటు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జిల్లా గ్రంధాలయ చైర్మెన్ కేడం లింగమూర్తి తెలిపారు. శుక్రవారం రోజున నిమజ్జనం చేసే ఘాట్‌ను కాంగ్రెస్ పార్టీ శ్రేణులతో కలిసి పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ వినాయక నిమజ్జనం సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ ఆదేశాల మేరకు ఇక్కడ ఎలాంటి అవాంచనీయ సంఘటనలు ఎదురవకుండా ఉండేందుకు మున్సిపల్, రెవెన్యూ, పోలీస్‌శాఖలు సమన్వయం చేసుకుంటున్నారన్నారు. ఘాట్ వద్ద వినాయక విగ్రహాలను నిమజ్జనం చేసేందుకు క్రేన్లు, ప్రమాదం జరిగి ఎవరైనా చెరువులో పడిపోతే కాపాడేందుకు గజ ఈతగాళ్లను సిద్ధంగా ఉంచినట్లు వివరించారు. అనంతరం ఎల్లమ్మ చెరువు కట్టపై ఏర్పాటు చేస్తున్న బతుకమ్మ ఘాట్‌ను పరిశీలించారు. కార్యక్రమంలో పార్టీ శ్రేణులు చిత్తారి పద్మ రవిందర్, మ్యాదరబోయిన శ్రీనివాస్‌తో పాటు ఉన్నారు.

### స్థానిక ఎన్నికలు నిర్వహించాలి : శ్యాంసుందర్‌గౌడ్

**హుస్నాబాద్ టౌన్, సెప్టెంబరు 5, ప్రభాతవార్త :** రాష్ట్రంలో సర్పంచ్‌ల పధవి కాలం పూర్తై దాదాపు రెండు సంవత్సరాలు దగ్గరకు వస్తున్నా ప్రభుత్వం సాకులు చెబుతూ స్థానిక ఎన్నికలు నిర్వహించడం లేదని బిఆర్ఎస్ పార్టీ బిసి సెల్ మండల ప్రధాన కార్యదర్శి పాకాల శ్యాంసుందర్ ఆరోపించారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ గ్రామాలలో ప్రజా ప్రతినిధులు లేని కారణంగా పారిశుధ్రంపై పర్యవేక్షణ కరువైందని, చెత్తను సేకరించే వాహనాలు కనీసం వారానికి రెండు రోజులులైన గ్రామాలలో తిరగక పోవడం వల్ల ఎక్కడి చెత్త అక్కడే పేరుకుపోతుందన్నారు. తద్వార దోమలు, ఈగలు ప్రభలి ప్రజలు అనారోగ్యాలకు గురౌతున్నారన్నారు. ప్రభుత్వం బిసి రిజర్వేషన్ అనే సాకుతో మరింత కాలయాపన చేయాలని చూస్తుందని, ప్రజల ఆకాంక్ష మేరకు వెంటనే స్థానిక ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు.

### శాంతియుత వాతావరణంలో నిమజ్జనానికి ప్రతి ఒక్కరు సహకరించాలి : సిఐ

**దుబ్బాక, సెప్టెంబర్ 5, ప్రభాతవార్త :** పట్టణంలో శనివారం సాయంత్రం నుంచి ఆదివారం ఉదయం లోపు జరిగే వినాయక విగ్రహాల నిమజ్జన శోభాయాత్ర నిర్వాహకులతో పాటు ప్రజలంతా సహకరించాలని దుబ్బాక సీఐ పాలేపు శ్రీనివాస్ కోరారు. శుక్రవారం దుబ్బాక సర్కిల్ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఏడవ తేదీన చంద్రగ్రహణం రానుండడంతో గ్రహణానికిముందే నిమజ్జనాన్ని పూర్తిచేయాలని నిర్వాహకులకు సూచించారు. నిమజ్జనానికి పట్టణంలోని పెద్ద చెరువు వద్ద అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని, దాదాపు 50 మంది వరకు పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. మండప నిర్వాహకులు డీజే ఏర్పాటుకు అనుమతి లేదని మరోసారి గుర్తు చేశారు. శాంతియుత వాతావరణంలో ఆదివారం ఉదయం లోపు వినాయక విగ్రహాల నిమజ్జనం పూర్తయ్యే విధంగా ప్రతి ఒక్కరూ సహకరించాలని విజ్ఞప్తి చేశారు. పురపాలక సిబ్బంది సహకారంతో చెరువు కట్ట వద్ద గజ ఈతగాల్లతో పాటు క్రేన్ సౌకర్యం ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఎక్సైజ్ అధికారుల సూచన మేరకు పట్టణంలోని మద్యం దుకాణాలు కూడా నేటి సాయంత్రం నుంచి ఆదివారం వరకు పూర్తిగా మూసి వేయబడతాయని తెలిపారు. శాంతియుత వాతావరణంలో నిమజ్జనం జరిగే విధంగా చూడాలని ప్రజలను కోరారు.

### రెడ్డి సంఘం చిన్నగుండవెల్లి అధ్యక్షుడిగా రాజిరెడ్డి



రెడ్డి సంఘం నూతన కార్యవర్గం

**సిద్దిపేట రూరల్, సెప్టెంబర్ 5, ప్రభాతవార్త:** రెడ్డి సంఘం సిద్దిపేట రూరల్ మండలం చిన్నగుండవెల్లి నూతన అధ్యక్షుడిగా గడీల రాజిరెడ్డిని శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షులుగా రాజరాంగారి మాధవరెడ్డి, సిహెచ్ మాధవరెడ్డి, ప్రధాన కార్యదర్శిగా పోలీసు నర్సింహారెడ్డి, సంయుక్త కార్యదర్శులుగా కమలాకర్‌రెడ్డి, పుల్లగూర్ల ఎల్లారెడ్డి, కోశాధికారిగా గుర్రం మల్లారెడ్డిలను ఎన్నుకున్నారు. సలహాదారులుగా గడీల భైరవరెడ్డి, భూమయ్యగారి సంజీరెడ్డి, కార్యవర్గ సభ్యులుగా అప్పయ్యగారి పున్నమిరెడ్డి, నక్క సత్తిరెడ్డి,మల్లమ్మగారి బాపురెడ్డి, కనకారెడ్డిలను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షులు గడీల రాజిరెడ్డి మాట్లాడుతూ సంఘం అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు. తనపై నమ్మకం ఉంచి అధ్యక్షునిగా ఎన్నుకున్నందులకు సంఘం సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు.

### గంజాయి అమ్ముతున్న ఇద్దరిపై కేసు నమోదు

**నర్సాపూర్, సెప్టెంబర్ 5, ప్రభాతవార్త:**

నర్సాపూర్ పట్టణంలో గంజాయి అమ్ముతున్న ఇద్దరిని అరెస్టు చేసి కేసు నమోదు చేసినట్లు రిమాండ్ కు తరలించినట్లు ఎస్సై బి లింగం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నర్సాపూర్ పట్టణంలో శుక్రవారం ఉదయం సమయంలో ఇద్దరు అనుమానితులు కుక్కల శివకుమార్ మరియు చింతకుంట ప్రేమ్‌కుమార్ నర్సాపూర్‌లో తిరుగుతున్నట్లు తెలిసిందన్నారు. వీరు ఇద్దరూ అనుమానాస్పదంగా తిరుగుతూ గంజాయి అమ్ముతున్నారన్న విశ్వసనీయ సమాచారంతో ఆ ఇద్దరి వ్యక్తులను పట్టుకున్నట్లు తెలిపారు. ఈ మేరకు వారిని సోదా చేయగా వారి వదనద నుండి 60 గ్రాముల గంజాయి లభించిందన్నారు. ఈ గంజాయిని స్వాధీనం చేసుకొని ఇద్దరిపై కేసు రమోదు చేసి జైలుకు తరలించినట్లు ఎస్సై లింగం తెలిపారు


నిరసన వ్యక్తంచేస్తున్న మిషన్ భగీరథ కార్మికులు

## 2వ రోజుకు చేరిన మిషన్ భగీరథ కార్మికుల సమ్మె

**మనూర్, సెప్టెంబర్ 5 ప్రభాతవార్త :** నియోజకవర్గంలోని 184 గ్రామాలకు మిషన్ భగీరథ నీటిని సరఫరా చేస్తున్నా, వేతనాలు అందక అవస్థలు పడుతున్న కార్మికుల నిరసన శుక్రవారంతో రెండవరోజుకు చేరింది. గురువారం బోరంచలోని మిషన్ భగీరథ ఇంటెక్ వెల్ నిలిపివేసి కార్మికులు నిరసనకు దిగిన విషయం పాఠకులకు విదితమే. నెలలతరబడి వేతనాలు అందకుంటే కుటుంబాలను ఎలా పోషించుకోవాలని కార్మికులు ప్రశ్నిస్తున్నారు. అధికారులు స్పందించి బకాయిపడిన 4నెలల వేతనాలు అందించాలని కార్మికులు కోరారు. నిరసన కార్యక్రమంలో ఆయాగ్రామాల మిషన్ భగీరథ కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయినులను సన్మానించిన మాజీమంత్రి


ఉపాధ్యాయినులను సన్మానిస్తున్న మాజీ మంత్రి చంద్రశేఖర్

**జహీరాబాద్, సెప్టెంబర్ 5 ప్రభాతవార్త :** కాంగ్రెస్ పార్టీ క్యాంప్ కార్యాలయంలో శుక్రవారం ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. వేడుకలకు మాజీమంత్రి, నియోజకవర్గ కాంగ్రెస్ ఇంచార్జి డాక్టర్ ఎ.చంద్ర శేఖర్ హాజరై 100 మంది ఉపాధ్యాయులను శాలువాలతో సన్మానించారు. ఈసందర్భంగా మాజీమంత్రి చంద్ర శేఖర్ మాట్లాడుతూ సమాజాభివృద్ధిలో ఉపాధ్యాయుల పాత్ర ఎనలేనిదని కొనియాడారు. కార్యక్రమలో కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు కండెం నర్సింలు, మండల అధ్యక్షులు మక్సూద్ ఆహ్మద్, బ్లాక్‌కాంగ్రెస్ అధ్యక్షులు అర్షద్ అలీ తదితరులు పాల్గొన్నారు.

## టిఎన్జిఆర్ఈఎ నూతన కార్యవర్గం


నూతన కార్యవర్గాన్ని సన్మానిస్తున్న కార్పొరేటర్ పుష్ప దృశ్యం

**రామచంద్రాపురం, సెప్టెంబర్ 5 ప్రభాతవార్త :** నూతనంగా ఎంపికైన రామచంద్రాపురం యూనిట్ టిఎన్జిఆర్ఈఎ కార్యవర్గాన్ని శుక్రవారం కార్పొరేటర్, జిహెచ్ఎంసి స్టాండింగ్ కమిటీ సభ్యురాలు బూరుగడ్డ పుష్పనగేష్ ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యవర్గం అధ్యక్షులుగా పి.రామ్‌రెడ్డి, కార్యదర్శిగా సిహెచ్ రాములు, కోశాధికారిగా జి.బస్వరాజు, అసోసియేట్ అధ్యక్షులుగా ఎం.మధుసూదన్‌శర్మ, ఉపాధ్యక్షులుగా వై.బుచ్చిరెడ్డి, ప్రవీణ, సంయుక్త కార్య దర్శిగా కె.విఠల్‌చారి, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా ఆర్.ప్రకాష్, పబ్లిసిటీ కార్యదర్శిగా డి.పోచయ్య, జిల్లా కౌన్సిలర్‌గా పి.మనోహర్, కె.వీరేశం ఎన్నికయ్యారు. కార్యక్రమంలో గుండం మోహన్‌రెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎసి.నర్సయ్య, కె.అంజయ్య, బాబురావు, రంచందర్, జగ్గారెడ్డిలు తదితరులు పాల్గొన్నారు.

## 6ఫోన్ల రికవరీ-బాధితులకు అందచేత

**అల్లాదుర్గం, సెప్టెంబరు 5, ప్రభాతవార్త:**

అల్లాదుర్గం పోలీసుతాణా పరిధిలోనివారు పోగొట్టుకున్న 6మొబైల్ ఫోన్‌లను రికవరీచేసి బాధితులకు శుక్రవారం పోలీసుతాణాలో అందచేసినట్లు ఎస్ఐ శంకర్ పేర్కొన్నారు. తమ మొబైల్‌ఫోన్లు మరిచిపోయి పోగొట్టుకున్నా, ఎవరైనా దొంగలించినా వెంటనే మొబైల్‌ఫోన్ ఐఎంఈఐ నంబరు ఆధార్‌కార్డు జిరాక్సులను అందచేస్తే సిఈఐఆర్ పోర్టల్ ద్వారా పోగొట్టుకున్న ఫోన్‌లను రికవరీచేసి అందచేస్తామన్నారు. పోగొట్టుకున్న ఫోన్‌లను తిరిగి తమకు అందజేసిన ఎస్ఐ శంకర్‌కు బాధితులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఎఎస్ గాలయ్య ఉన్నారు.

## ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానించిన పిఆర్‌టియు


ఉపాధ్యాయులను సన్మానిస్తున్న పిఆర్‌టియు నాయకులు

**జహీరాబాద్, సెప్టెంబర్ 5 ప్రభాతవార్త :** ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయులను పిఆర్‌టియు నాయకులు శుక్రవారం ఘనంగా సన్మానించారు. మొగుడంపల్లి మండ లంలోని పర్వతాపూర్ ఎంపిపిఎస్ఎ ఉపాధ్యాయులు ఎస్.ఆనంద్, జహీరాబాద్ పట్టణంలోని ఎంపియుపిఎస్ నంబర్1 పాఠశాల ఉపా ధ్యాయులు ఈ.సిద్దేశ్వర్‌లను జిల్లా కలెక్టర్ ప్రావీణ్య సన్మానించి జ్ఞాపికలను అందచేసిన సందర్భంగా పిఆర్‌టియు జిల్లా అధ్యక్షులు మాణయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రభు, జిల్లా గౌరవాధ్యక్షులు డాక్టర్ తులసిరామ్‌రాథోడ్, పిఆర్‌టియు మొగుడంపల్లి అధ్యక్షులు అర్జున్‌చవ్వాణ్, జహీరాబాద్ రూరల్ అధ్యక్షులు బాగయ్య, ప్రధానకార్యదర్శి అశోక్, రాష్ట్ర అసోసియేట్ అధ్య క్షులు వరాలు, విఠల్, రాష్ట్రకార్యదర్శి స్వామిదాస్, హన్మంత్‌పవార్, మోహన్, ఉపాధ్యాయులు వీరేశం, సూర్యకళ, మిన్హాజ్, నజీమా పాల్గొన్నారు.

## ఘనంగా మిలాద్-ఉన్-నబీ వేడుకలు

**మనూర్, సెప్టెంబరు 5, ప్రభాతవార్త:**

**మనూర్, సెప్టెంబర్ 5 ప్రభాతవార్త :** మండలంలో శుక్రవారం మిలాద్-ఉన్-నబీ వేడుకలను ముస్లింలు ఘనంగా జరుపుకున్నారు. రాయిపల్లి గ్రామంలో జామామస్జిద్ కమిటీ ఆధ్వర్యంలో 1500 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఈద్ మిలాద్-ఉన్-నబీ ఘనంగా జరుపుకున్నారు. మొహమ్మద్ ప్రవక్త జన్మ దినాన్ని మిలాద్-ఉన్-నబీ వేడుకగా చేసుకుంటామని మజీద్ ఇమామ్ తెలిపారు. కార్యక్రమంలో జామా మస్జిద్ కమిటీ సభ్యులు, గ్రామ మైనార్టీ ముస్లింలు పాల్గొన్నారు.


మిలాద్-ఉన్-నబీ వేడుకలు జరుపుకుంటున్న ముస్లింలు

# అరెకటికలకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి

### -బిసి-డి నుంచి బిసి-ఎ హోదా కల్పిస్తూ జివో జారీ చేయాలి
### -రాష్ట్ర అధ్యక్షులు భూంపల్లి అశోక్ దాదా

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి:**

అరెకటికలకు ప్రత్యేక రిజర్వేషన్ కల్పించడంతో పాటు రూ.500 కోట్లతో ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని అరెకటిక అభివృద్ధి సంఘం రాష్ట్ర అధ్యక్షులు భూంపల్లి అశోక్‌దాదా ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సిద్దిపేట ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బిసి-డి నుంచి బిసి-ఎ హోదా కల్పిస్తూ జివో జారీ చేయాలన్నారు. మేకల మండీలను ఆధునీకరణ చేసి అరెకటికలకు అప్పగించాలన్నారు. సమీకృత మార్కెట్ యార్డులలో అరెకటికలకు పూర్తి హక్కు కల్పిస్తూ జివో జారీ చేయాలన్నారు. వైన్స్ టెండర్లు, మేకల మండీలు, మటన్ మార్కెట్లు వంటి వనాధార వృత్తులపై తమకు న్యాయం చేయాలని కోరారు. అరెకటికల బిడ్డ సునీల్‌కుమార్ తెలంగాణ ఉద్యమంలో ప్రాణ త్యాగం చేసినప్పటికీ ఈ కులానికి ఇప్పటివరకు గుర్తింపు, ప్రోత్సాహం తగిన స్థాయిలో లభించడం లేదని వాపోయారు. 2020 నుంచి 2023 వరకు 10మంది ఆత్మహత్యలు చేసుకోవడం జరిగిందన్నారు. మేకల వ్యాపారం కుంగిపోవడంతో అప్పుల బాధల్లో కూరుకుపోయిన అరెకటిక కుటుంబాలు ఇబ్బందుల్లో ఉన్నాయన్నారు. అరెకటికలకు ప్రమాద బీమా రూ.25లక్షలు వర్తింపచేయాలన్నారు. సమావేశంలో సంఘం జిల్లా అధ్యక్షులు జి.మధుసూదన్, ప్రధాన కార్యదర్శి జి.శ్రీనివాస్, నాయకులు బాలకిషన్, కె.రవీందర్, బాలరాజు, స్వప్నలాల్, శ్రీనివాస్, శ్రీకాంత్, అశోక్, ఈశ్వర్ లాల్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న అరెకటికల సంఘం అభివృద్ధి రాష్ట్ర అధ్యక్షులు అశోక్ దాదా


త్రివేణిని సన్మానిస్తున్న కలెక్టర్, డిఈఓ, ఎమ్మెల్సీలు

## జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుల ఎంపిక

**మనూర్, సెప్టెంబరు 5, ప్రభాతవార్త:**

జిల్లాస్థాయి ఉత్తమ ఉపాధ్యాయులుగా మండలం నుంచి ముగ్గురు ఉపాధ్యాయులు ఎంపికై శుక్రవారం సన్మానం అందుకున్నట్లు మండల విద్యాధికారి రాజశేఖర్‌శెట్కార్ తెలిపారు. ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా కేంద్రమైన సంగారెడ్డిలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో త్రివేణి (ఉసిరికపల్లి పాఠశాల), జెసి.ప్రసాద్ (ఎల్గోయి పాఠశాల), డి.నర్సింలు (సెలిగిరా పాఠశాల)ను జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య, జిల్లా విద్యాధికారి వెంకటేశ్వర్లు, పట్టభద్రుల ఎమ్మెల్సీ చిన్నమైల్ అంజిరెడ్డిలు సన్మానించి ప్రశంసాపత్రాలను అందచేశారు. జిల్లాస్థాయి ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపిక కావడం ఆనందంగా ఉందని, తమపై మరింత బాధ్యత పెరిగిందని ఉత్తమ ఉపాధ్యాయులు పేర్కొన్నారు.

## కేతకి ఆలయాన్ని దర్శించుకున్న హైకోర్టు సిట్టింగ్ జడ్జి

**ఝరాసంగం, సెప్టెంబరు 5, ప్రభాతవార్త:**


కేతకి ఆలయాన్ని దర్శించుకుంటున్న హైకోర్టు సిట్టింగ్ జడ్జి లతబస్వరాజ్‌పట్నే

మండలకేంద్రమైన ఝరాసంగంలోని శ్రీకేతకిసంగమేశ్వరస్వామి ఆలయాన్ని శుక్రవారం తెలంగాణ హైకోర్టు సిట్టింగ్ న్యాయమూర్తి లతబస్వరాజ్‌పట్నే దర్శించుకున్నారు. ఆలయానికి చేరుకున్న సిట్టింగ్ న్యాయమూర్తికి ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతంపలికారు. సిట్టింగ్ న్యాయమూర్తికి తీర్థ ప్రసాదాలు అందచేసి శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో ఆలయకమిటీ చైర్మన్ చంద్రశేఖర్‌పాటిల్, ఈఓ శివరుద్రప్ప, మండల కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షులు హన్మంతరావుపాటిల్, తహసీల్దార్ తిరుమలరావు, ఆలయ అర్చకులు, పోలీసు, ఆలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## నరేంద్రమోడీ చిత్రపటానికి క్షీరాభిషేకం

**సంగారెడ్డి టౌన్, సెప్టెంబరు 5, ప్రభాతవార్త:**

ప్రధానమంత్రి నరేంద్ర మోడీ జిఎస్టి స్లాబ్‌లను కొన్నింటిపై పూర్తిగా ఎత్తేయడం, మరికొన్నింటిపై తగ్గిస్తూ తీసుకున్న నిర్ణయం ఆనందంగా ఉందని బిజెపి నాయకులు ఆనందం వ్యక్తంచేస్తూ శుక్రవారం జిల్లా కేంద్రమైన సంగారెడ్డి పట్టణంలో ప్రధానమంత్రి చిత్రపటానికి క్షీరాభిషేకంచేశారు. కార్యక్రమంలో బిజెపి జిల్లా ఉపాధ్యక్షులు వెంకట నరసింహారెడ్డి, కార్యదర్శి మందుల నాగరాజు, పట్టణ మాజీ అధ్య క్షులు ద్వారకా రవి, మీనాగౌడ్, పట్టణ ప్రధానకార్యదర్శి అజయ్, శ్రీనివాస్ రెడ్డి, శివ, శివంగుల నాగరాజు, మురళీధర్‌రెడ్డి, గురునాథ్, ప్రవీణ్, లింగ మూర్తి, క్రాంతి, బాల మురళీధర్ రావు, దుర్గయ్య, శ్రీకాంత్, రామచందర్ తదితరులు పాల్గొన్నారు.


నరేంద్రమోడీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న బిజెపి నాయకులు

## ఐక్యతకు ప్రతిరూపం గణేష్ ఉత్సవాలు

### -ఎమ్మెల్యే, సెట్విన్ చైర్మన్, మాజీమంత్రి


ఉత్సవనిర్వాహకులకు బహుమతులందచేస్తున్న ఎమ్మెల్యే, సెట్విన్ చైర్మన్‌లు

**జహీరాబాద్, సెప్టెంబరు 5, ప్రభాతవార్త:**

ఐక్యతకు, స్నేహభావాలకు ప్రతిరూపం గణేష్‌నవరాత్రి ఉత్సవాలని ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు, మాజీమంత్రి చంద్రశేఖర్, సెట్విన్‌చైర్మన్ ఎన్. గిరిధర్ రెడ్డిలు అన్నారు. గురువారంరాత్రి జహీరాబాద్ పట్టణంలోని భవానీమాత మందిరం చౌరస్తాలో సార్వజనిక్ గణేష్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణేష్ నిమజ్జన కార్యక్రమం నిర్వహించి చౌరస్తా వద్ద ఆయా ప్రాంతాల నుంచి నిమజ్జనానికి బయలెక్కిన వినాయకులకు స్వాగతంపలికి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో డిసిఎంఎస్ చైర్మన్ మల్కాపురం శివకుమార్, కాంగ్రెస్ నాయకులు డాక్టర్ ఉజ్వల్‌రెడ్డి, ఆత్మకమిటీ చైర్మన్ రామలింగారెడ్డి, పట్టణకాంగ్రెస్ అధ్యక్షులు కండెం నర్సింలు, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ గుండప్ప, జమీరాబాద్, ఝరాసంగం మండలాల బిఆర్ఎస్ అధ్యక్షులు తట్టు నారాయణ, వెంకటేశం తదితరులు పాల్గొనగా డిఎస్‌పి సైదా నాయక్ ఆధ్వర్యంలో పట్టణ సిఐ శివలింగం, రూరల్ సిఐ జక్కుల హన్మంతు, ఆయా పోలీసు ఠాణాల ఎస్ఐలు, సిబ్బంది బందోబస్తును నిర్వహించారు.

## గంగోజిపేటలో సిఎంఆర్‌ఎఫ్ చెక్కు అందచేత

**చౌటకూరు, సెప్టెంబరు 5, ప్రభాతవార్త:**

మండలపరిధిలోని గంగోజిపేట గ్రామానికి చెందిన అల్వాల మైనోద్దిన్‌కు మాజీసర్పంచ్ గౌండ్ల బాలాగౌడ్ శుక్రవారం రూ.60వేల సిఎంఆర్‌ఎఫ్ చెక్కును అందచేశారు. రాష్ట్రవైద్య ఆరోగ్యశాఖామంత్రి దామోదర్ రాజ నర్సింహ సూచనలమేరకు చెక్కును అందచేశామన్నారు. కార్యక్రమంలో సోషల్‌మీడియా సమన్వయకర్త ఫెరోజ్, నాయకులు మిన్‌పూర్ భాస్కర్, రాజు గౌడ్, సామయ్య, శ్రవణ్‌కుమార్, అక్బర్, నవీన్ పాల్గొన్నారు.

## ప్రధాని చిత్రపటానికి క్షీరాభిషేకం

**నర్సాపూర్, సెప్టెంబర్ 5, ప్రభాతవార్త:**

జిఎస్టి స్లాట్ తగ్గించి సామాన్య మనిషికి పెను భారం తగ్గించినందుకు నర్సాపూర్‌లో శుక్రవారం బిజెపి జిల్లా అధ్యక్షులు వాల్‌దాస్ రాధామల్లేష్ గౌడ్, రాష్ట్ర బిజెపి ఓబిసి ఉపాధ్యక్షులు పాపగారి రమేష్‌గౌడ్‌తో పాటు స్థానిక బిజెపి నాయకుల ఆధ్వర్యంలో దేశ ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ చిత్రపటానికి పాలతో అభిషేకం చేసే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా బిజెపి నాయకులు మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో ప్రతి పేద వాడు అందరితో సమానంగా జీవించాలన్న లక్ష్యం తో దేశ ప్రధాని నరేంద్ర మోడీ ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న నిర్ణయం అన్నారు. దీంతో ప్రతి నిరుపేదకు న్యాయం జరగాలన్న ఉద్దేశంతో జిఎస్టి స్లాట్ తగ్గించి సామాన్యుడు ప్రతినిత్యం వాడుకునే వస్తువుల పైన పన్ను భారం తగ్గించడం శుభ పరిణామమన్నారు. ఈ మేరకు దేశంలోని ప్రతి నిరుపేదకు ఇది ఎంతో మేలు చేకూరుస్తుంది అని అన్నారు. ఈకార్యక్రమంలో బిజెపి జిల్లా అధ్యక్షులు వాల్‌దాస్ రాధామల్లేష్‌గౌడ్, రాష్ట్ర బిజెపి ఓబిసి ఉపాధ్యక్షులు పాపగారి రమేష్‌గౌడ్‌లతో పాటు జిల్లా బిజెపి ప్రధాన కార్యదర్శి సంఘసాని సురేష్, జిల్లా బిజెపి ఉపాధ్యక్షులు వనముల బుచ్చేష్ యాదవ్, అసెంబ్లీ కన్వీనర్ హెచ్‌వి.రమణారావు, మాజీ ప్రధాన కార్యదర్శి గోద రాజేందర్, మండల అధ్యక్షులు నీలి నాగేష్,పట్టణ అధ్యక్షులు నీరుడి చంద్రయ్య, నాయకులు రాములునాయక్, ఆశన్న గారి దేవేందర్‌యాదవ్, బబ్బురి కృష్ణ, బిజెపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


ప్రధాని నరేంద్రమోడీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న బిజెపి నేతలు

# ఉపాధ్యాయులను గౌరవించాలి

### -శ్రీపాద ట్రస్ట్ చైర్మన్ పైడి శ్రీధర్‌గుప్తా


ఉపాధ్యాయులకు సన్మానంచేస్తున్న శ్రీపాద ట్రస్ట్ చైర్మన్ పైడి శ్రీధర్‌గుప్తా

**నర్సాపూర్, సెప్టెంబర్ 5, ప్రభాతవార్త:**

ప్రతి ఒక్కరు తమ గురువులను గౌరవించాలని శ్రీపాద ట్రస్ట్ చైర్మన్ పైడి శ్రీధర్‌గుప్తా అన్నారు. శుక్రవారం డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి, ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా నర్సాపూర్ లో శ్రీపాద ట్రస్ట్ చైర్మన్ పైడి శ్రీధర్‌గుప్తా ఆధ్వర్యంలో ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. శుక్రవారం ఉదయం నర్సాపూర్‌లోని అల్లూరి సీతారామరాజు గిరిజన గురుకుల పాఠశాల మైదానంలో ఉపాధ్యాయులతో కలిసి ఉపాధ్యాయ దినోత్సవాన్ని జరుపుకున్నారు. ఈ సందర్భంగా గురుకులంలోని ఉపాధ్యాయులను ఇతర ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులను శ్రీపాద ట్రస్ట్ పైడి శ్రీధర్‌గుప్తా శాలువాలతో సత్కరించారు. ఈ సందర్భంగా శ్రీధర్‌గుప్తా మాట్లాడుతూ గురువులు అజ్ఞానమనే చీకటిని పారదోలి జ్ఞానమనే వెలుతురు నింపి విద్యార్థులను జ్ఞానవంతులుగా చేస్తారన్నారు. ఈమేరకు ప్రతి ఒక్కరు గురువుల ఎడల భక్తిభావం ఉంచి వారిని గౌరవించవలసిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఈమేరకు ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా ఉపాధ్యాయులను తన వంతు శక్తి కొలది సన్మానించడం తన అదృష్టంగా భావిస్తున్నానని పైడి శ్రీధర్‌గుప్తా వెల్లడించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## ఉచిత వైద్యశిబిరం విజయవంతం

**వట్‌పల్లి, సెప్టెంబర్ 5, ప్రభాతవార్త:**

వట్‌పల్లి మండలకేంద్రంలో మిలాద్-ఉన్-నబీ సందర్భంగా ఆమోద హాస్పిటల్‌వారి సౌజన్యంతో మెగా వైద్య ఆరోగ్యశిబిరం విజయవంతంగా ముగిసింది. 250మంది ఆరోగ్యపరీక్షలు నిర్వహించారు. క్యాంపులో కార్డియాక్, డయాబెటిక్, జనరల్ చెక్-అప్, షుగర్‌లాంటి పరీక్షలు నిర్వహించారు. ఈకార్యక్రమంలో యూత్‌కాంగ్రెస్ నాయకులు శ్రీకాంత్‌రెడ్డి అండ్ మాజీసర్పంచ్ సంగారెడ్డి, కార్యక్రమ నిర్వాహకులు కో-ఆప్షన్ మెంబర్ కుతుబుద్దీన్ చిస్తి, సుల్తాన్‌అలీ చిస్తి, మొయినుద్దీన్ చిస్తి, కమలుద్దీన్ చిస్తి, రహీం చిస్తి, ముజాతబ్, హమీద్, సైఫ్, బాశిరెడ్డి అండ్ ఆమోద హాస్పిటల్ సిబ్బంది డా.వేణు, శేఖర్, బాలభీం, ప్రసాద్ పాల్గొన్నారు.

## నియో ప్రగతి ఉన్నతపాఠశాలలో టీచర్స్‌డే

**నారాయణఖేడ్, సెప్టెంబరు 5, ప్రభాతవార్త:**

నియో ప్రగతి ఉన్నతపాఠశాలలో ఈరోజు ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా జరుపుకోవడం జరిగింది. అందులోభాగంగా పిల్లలందరూ వారి వారి తరగతి ఉపాధ్యాయులకు శాలువాతో సన్మానంచేసి వారి ఆశీర్వాదాన్ని తీసుకోవడం జరిగింది. కార్యక్రమంలో కరెస్పాండెంట్ కె.వెంకటరత్నం, ప్రిన్సిపాల్ కె.ప్రకాష్, ఉపాధ్యాయబృందం విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

## నిరుపేదలకు అండగా కాంగ్రెస్ ప్రభుత్వం

### -మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నత్తి దశరథ్


రేషన్‌కార్డులు, రేషన్‌బియ్యం పంపిణీచేస్తున్న నత్తి దశరథ్

**చౌటకూరు, సెప్టెంబరు 5, ప్రభాతవార్త:**

నిరుపేదలకు కాంగ్రెస్ ప్రభుత్వం అండగా ఉంటోందని మండల కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షులు నత్తి దశరథ్ అన్నారు. మండల పరిధిలోని చక్రియాల్‌లో శుక్రవారం కొత్తగా మంజూరైన రేషన్ కార్డులను అందచేసి వారికి సన్నబియ్యం సైతం పంపిణీచేసే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నత్తి దశరథ్ మాట్లాడుతూ గత 10ఏళ్లలో బిఆర్ఎస్ ప్రభుత్వం ఒక్క కొత్త రేషన్‌కార్డును సైతం అందచేయలేకపోయిందని విమర్శించారు. కాంగ్రెస్‌ప్రభుత్వం కొత్త రేషన్‌కార్డులను మంజూరు చేయడంతోపాటు కార్డుల్లో మార్పులుచేర్పులు చేసుకనే అవకాశం కల్పించిందన్నారు. కార్యక్రమంలో ఆత్మకమిటీ చైర్మన్ మల్లారెడ్డి, కాంగ్రెస్ గ్రామకమిటీ అధ్యక్షులు చిన్నరోళ్లపాటి రాజశేఖర్, రేషన్ డీలర్ల సంఘం మండల అధ్యక్షులు ఉప్పరి దేవదాస్, నాయకులు విష్ణువర్దన్‌రెడ్డి, నీరుడి లక్ష్మీనారాయణముదిరాజ్, మన్నే నర్సింలు, బుద్దయ్య పాల్గొన్నారు.

## మత సామరాస్యానికి ప్రతీక సిద్దిపేట

### -పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు అత్తు


వేలంపాటలో లడ్డూదక్కించుకున్న ముస్లిం నాయకుడు అత్తు

**సిద్దిపేట అర్బన్, సెప్టెంబరు 5, ప్రభాతవార్త:**

సిద్దిపేట ప్రాంతం మతసామరాస్యానికి ప్రతీకగా నిలుస్తువస్తుందని సిద్దిపేట పట్టణ కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షులు ఎండి.ఇమామ్(అత్తు) అన్నారు. జిల్లా కేంద్రంలోని 9వ వార్డులో ఏర్పాటు చేసిన వినాయకమండపం వద్ద శుక్రవారం నిర్వహించిన 21 కిలోల లడ్డూ వేలంపాట పోటాపోటీగా సాగగా 5వసారి రూ.51116కు లడ్డూను దక్కించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హిందువుల పండుగకు ముస్లింలు, ముస్లింల పండుగకు హిందువులు కలిసిమెలిసి జరుపుకునే గొప్ప సంస్కృతి సిద్దిపేటలో కొనసాగుతూ వస్తుందన్నారు. మరో 10యేళ్ల పాటు కాంగ్రెస్‌పార్టీ అధికారంలో ఉండేలా లంబోదరుడు ఆశీర్వదించాలన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు మధు, గయాజుద్దీన్, హర్షద్, ఫయాజ్, సలీం తదితరులు పాల్గొన్నారు.

## అమీన్‌పూర్‌లోనే నవోదయ పాఠశాల

### -కేంద్రాన్ని ఒప్పించిన మెదక్ ఎంపి రఘునందన్‌రావు


కేంద్రమంత్రిని కలిసిన ఎంపి దృశ్యం

**అమీన్‌పూర్, సెప్టెంబరు 5, ప్రభాతవార్త:**

కేంద్రప్రభుత్వం సంగారెడ్డి జిల్లాకు మంజూరుచేసిన జవహర్ నవోదయ విద్యాలయం అమీన్‌పూర్‌లోనే స్థాపించేలా మెదక్ పార్లమెంట్ సభ్యులు మాధవనేని రఘునందన్‌రావు కేంద్రాన్ని ఒప్పించారు. శుక్రవారం నవోదయ పాఠశాల డిప్యూటీ కమిషనర్ అభిజిత్ బేరని కలిసి ఈ విషయం గురించి చర్చించారు. ఈ సందర్భంగా, పాఠశాల నిర్మాణం, తాత్కాలిక వసతి సదుపాయాలపై సమగ్రమైన చర్చ జరిపారు. అమీన్‌పూర్‌లోనే పాఠశాల ఏర్పాటుచేసేందుకు డిప్యూటీ కమిషనర్‌ని ఒప్పించారు. అనంతరం ఎంపి రఘునందన్‌రావు మాట్లాడుతూ రూ.1500కోట్లతో నిర్మించే ఈపాఠశాలకు ప్రతి ఏటా రూ.500కోట్ల చొప్పున మూడేళ్ల నిధులు విడుదల జరుగుతుందన్నారు. భవన నిర్మాణం పూర్తయ్యేలోగా ప్రైవేట్ భవనాన్ని అద్దెకు తీసుకుని తాత్కాలిక వసతి కల్పించి వచ్చే విద్యా సంవత్సరంలో పాఠశాల ప్రారంభం అయ్యేలా ప్రయత్నాలు చేస్తున్నామని తెలిపారు. నవోదయ పాఠశాలకు అమీన్‌పూర్‌లో కేటాయించిన స్థలాన్ని పరిశీలించేందుకు అధికారులు వచ్చేవారం రానున్నారని తెలిపారు. పాఠశాల ఏర్పాటుకు అవసరం అయ్యేలా భూమిని అభివృద్ధిచేసి ఇచ్చేందుకు తగినచర్యలు తీసుకుంటామని స్పష్టంచేశారు.

## ఆక్యుప్రెషర్‌తో రోగాలు దూరం

### -మందు, సూది లేకుండా చికిత్స

**రామచంద్రాపురం, సెప్టెంబరు 5, ప్రభాతవార్త:**

ఆక్యుప్రెషర్, మాగ్నెటిక్, వైబ్రేషన్ థెరఫీ, సుజోక్ థెరఫీలో మందులు, సూదులు లేకుండా రోగాలను నయం చేసుకునేందుకు భెల్ ఇంజనీర్ అండ్ ఆఫీసర్ అసోసియేషన్ సహకారంతో రామచంద్రాపురంలోని భెల్ బిఈఓఎ కార్యాలయంలో ఆరోగ్య వైద్యశిబిరాన్ని ఏర్పాటుచేశారు. రాజస్థాన్ ఆరోగ్య జీవన్ సంస్థ డాక్టర్ రామ్‌మనోహర్ లోహియా బృందం ఆధ్వర్యంలో మెడనొప్పి, తలనొప్పి, ఆర్థరైటిస్, మోకాళ్ళ నొప్పులు, నడుమునొప్పి, ఆస్తమా, రక్తపోటు, నిద్రలేమి, మధుమేహం, థైరాయిడ్, అసిడిటీ, కళ్లు,చెవి,ముక్కుసంబంధిత సమస్యలనుంచి ప్రజలు ఉపశమనం పొందవచ్చని ఆక్యుప్రెషర్ థెరపిస్ట్ డాక్టర్ వైష్ణవ్ పేర్కొన్నారు. సెప్టెంబరు 6వ తారీఖునుంచి 8వ తేదీ వరకు ఉదయం నుంచి సాయంత్రంవరకు ఆరోగ్యశిబిరంద్వారా వైద్యం అందచేస్తామన్నారు.